

# ఎడారి నివారణకు ప్రత్యేక నిధులివ్వండి

**- కేంద్ర మంత్రికి ఎమ్మెల్యే, ఎంపీల విజ్ఞప్తి**

**రాయదుర్గం ఆగస్టు 12 ప్రభాతవార్త**

రాయదుర్గం నియోజకవర్గ పరిధిలోని కనేకల్లు, బొమ్మనహాళ్ మండలాల్లో ఎడారి నివారణకు రూ.150కోట్ల ప్రత్యేక నిధులు మంజూరు చేయాలని కేంద్ర గ్రామీణ అభివృద్ధి సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ ను ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు, అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ కోరారు. ఈ మేరకు ఢిల్లీలోని మంత్రి కార్యాలయంలో బుధవారం ఆయనకు వినతిపత్రం సమర్పించారు. దక్షిణ భారతదేశంలోనే ఎడారి ఛాయలు వేగంగా విస్తరిస్తున్న రాయదుర్గం ప్రాంతానికి ప్రత్యేకంగా కేంద్ర నిధులు మంజూరు చేయాలని వారు ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు. నియోజకవర్గ పరిధిలోని మాల్యాం నుంచి దర్గా హున్నూరు వరకు దాదాపు 20 వేల ఎకరాల విస్తీర్ణంలో ఇసుకమేటలు, ఇసుక దిబ్బలు విస్తరించిన విషయాన్ని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఎడారి క్రమంగా విస్తరిస్తుండటంతో స్థానిక ప్రజలు, రైతులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివరించారు. వీటి నివారణ కోసం గత టీడీపీ ప్రభుత్వ హయాంలో 2017లో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా కొంతమేర ప్రయత్నం జరిగిందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రత్యేక చొరవతో ఆనాడు చర్యలు తీసుకున్నప్పటికీ, అవి పూర్తిగా ఫలప్రదం కాలేదని తెలిపారు. ఏటికేడు ఎడారీకరణ క్రమంగా విస్తరిస్తుండటం ఆందోళన కలిగిస్తోందని, శాస్త్రీయ అధ్యయనాలు కూడా ఈ విషయాన్ని తేటతెల్లం చేస్తున్నాయని పేర్కొన్నారు. ఇటీవల ఉపాధి హామీ పథకం రాష్ట్ర డైరెక్టర్ షణ్ముఖ్ నేతృత్వంలోని ఉన్నతస్థాయి బృందం రాజస్థాన్‌లోని ఎడారి ప్రాంతాల్లో పర్యటించి అక్కడి పరిస్థితులను అధ్యయనం చేసిందన్నారు. రాయదుర్గం ప్రాంతంలో ఎడారి నివారణకు తీసుకోవలసిన చర్యలపై బృందం అనేక సిఫార్సులు చేసినట్లు తెలిపారు. అయితే సాధారణ నిధులు ఎడారి నివారణ చర్యల అమలుకు ఏమాత్రం సరిపోవని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. కావున రాబోయే మూడేళ్లలో ఉపాధి హామీ పథకం కింద ప్రత్యేకంగా ఎడారి నివారణ కోసం రూ.150 కోట్ల నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. తద్వారానే ఎడారి నివారణ చర్యలు చేపట్టడానికి సాధ్యపడుతుందని వివరించారు. తమ విజ్ఞప్తిపై కేంద్ర మంత్రి చంద్రశేఖర్ సానుకూలంగా స్పందించారని, సాధ్యాసాధ్యాలను పరిశీలించి త్వరలోనే తగిన సమాచారం అందజేస్తామని హామీ ఇచ్చారని ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు తెలిపారు.







అనంతపురం/శ్రీ సత్యసాయి

తెలుగు జాతీయ దినపత్రిక

వార్త

గురువారం 13 ఆగస్టు 2026 | పేజీలు : 04


# ఆహార కల్తీకి అడ్డుకట్ట ఏదీ?




- ❖ జిల్లాలో ఫుడ్ బిజినెస్‌ల జోరు
- ❖ హోటళ్లు, రెస్టారెంట్లు, ఫాస్ట్‌ఫుడ్ కేంద్రాలపై పర్యవేక్షణ ప్రశ్నార్థకం
- ❖ పెరుగుతున్న ఆహార కల్తీ ఫిర్యాదులు
- ❖ ఆహార భద్రత శాఖలో సిబ్బంది కొరత
- ❖ వాహన సౌకర్యం లేక తనిఖీలకు ఇబ్బంది

**అనంతపురం న్యూటౌన్, ఆగస్టు 12 ప్రభాతవార్త**

*ఒకవైపు జనాభా సంఖ్య పెరుగుతుంది. అందుకు హోటళ్లు, రెస్టారెంట్లు, దాబాలు, టిఫిన్ సెంటర్లు, స్నాక్స్, ఫాస్ట్‌ఫుడ్ కేంద్రాలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. వీటికి తోడు ఆన్‌లైన్ ఫుడ్ డెలివరీ సంస్థల ద్వారా ఇంటికే ఆహారం చేరుతున్న నేపథ్యంలో ప్రజలకు అందుతున్న ఆహారం నాణ్యత, తయారీ విధానంపై పర్యవేక్షణ మరింత కీలకంగా మారింది. అయితే ఆహార భద్రత విభాగంలో సిబ్బంది కొరత, ఖాళీ పోస్టుల భర్తీ లేకపోవడం, క్షేత్రస్థాయి తనిఖీలకు వాహన సౌకర్యం లేకపోవడం వంటి సమస్యలు అధికారుల పనితీరుకు అడ్డంకిగా మారుతున్నాయన్న విమర్శలు వినిపిస్తున్నాయి.*

అనంతపురం జిల్లాలో ఆహార భద్రత శాఖ లో ఒక ఏఎఫ్ సీ, రెండు ఎఫ్ ఎస్ ఓ , ఒక పర్యవేక్షకులు, రెండు సబార్డినేటర్, ఒక ఔట్ సోర్సింగ్ కింద జూనియర్ అసిస్టెంట్ కం టైపిస్ట్ పోస్టులతో పాటు మొత్తం ఏడు పోస్టులు ఉన్నాయి. అందులో ఒక ఎఫ్ ఎస్, ఒక పర్యవేక్షకులు, రెండు సబార్డినేటర్లు మొత్తం నాలుగు పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఉన్న సిబ్బందిపైనే అదనపు పనిభారం పడటంతో జిల్లాలో విస్తరిస్తున్న ఆహార వ్యాపార సంస్థలను పూర్తిస్థాయిలో తనిఖీ చేయడం సవాలుగా మారుతోంది.

**పెరుగుతున్న ఫుడ్ బిజినెస్.. తగ్గుతున్న పర్యవేక్షణ?**

అనంతపురం నగరంతో పాటు పరిసర ప్రాంతాల్లో కొత్తగా హోటళ్లు, రెస్టారెంట్లు, దాబాలు, టిఫిన్ సెంటర్లు, బేకరీలు, స్నాక్స్, ఫాస్ట్‌ఫుడ్ కేంద్రాలు పెద్ద సంఖ్యలో ఏర్పడుతున్నాయి. మరోవైపు వినియోగదారులను ఆకర్షించేందుకు వివిధ ఆఫర్లతో వ్యాపార సంస్థలు పోటీపడుతున్నాయి. ఆన్‌లైన్ ద్వారా ఆహారాన్ని ఆర్డర్ చేసుకునే వారి సంఖ్య మిగతా 4లో...

# శాస్త్రీయ విద్యావిధానం కోసం విద్యార్థులు పోరాడాలి



సదస్సులో మాట్లాడుతున్న ఏఎస్ఎఫ్ మాజీ జాతీయ నాయకులు శ్రీనివాసులు నాయుడు

- ❖ భారత చరిత్రనే మార్చివేసే ప్రయత్నాలు జరుగుతున్నాయి.
- ❖ ఏఐఎస్ఎఫ్ సమరశీల పోరాటాలు ఎన్నో
- ❖ ఏఐఎస్ఎఫ్ 90 వసంతాల వేడుకల్లో వక్తలు వెల్లడి



సదస్సులో మాట్లాడుతున్న ఎస్కేయూ విశ్రాంత అధ్యాపకులు రాచపాళెం చంద్రశేఖర్ రెడ్డి

**అనంతపురం, ఆగస్టు 12, (ప్రభాతవార్త బ్యూరో)**

డామిట్ కథ అడ్డం తిరిగింది అన్న రీతిలో భారత విద్యా వ్యవస్థ తయారైందని, భారత చరిత్ర గానే ఉంచాలని, చరిత్రనే మార్చాలని యత్నిస్తున్నారని ఎస్కే యూనివర్సిటీ విశ్రాంత అధ్యాపకులు రాచపాలెం చంద్రశేఖర్ రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. చరిత్రలో ముస్లిం రాజులకు పాత్ర ఎంతో ఉందని, వారి పాత్రను తీసివేసి హిందూ రాజుల పాత్రలోనే ప్రముఖంగా చూపాలని ప్రయత్నాలు జరుగుతున్నాయని, భారతదేశ చరిత్రని



సమావేశానికి హాజరైన విద్యార్థులు, ఏఎస్ఎఫ్ నాయకులు, కార్యకర్తలు

మార్చడం ఎంతవరకు సబబు అని ఆయన ప్రశ్నిస్తూ విద్యార్థులు శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకొని చదువులో రాణించాలని పిలుపునిచ్చారు. అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏ.ఐ.ఎస్.ఎఫ్) 90 సంవత్సరాలు పూర్తిచేసుకున్న సందర్భంగా అనంతపురం నగరం లోని ఆర్ట్స్ కాలేజీ డ్రామా హాల్ లో 90 వసంతాల వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏ ఐ ఎస్ ఎఫ్ మాజీ జాతీయ నాయకులు శ్రీనివాసులు నాయుడు పతాక ఆవిష్కరణ చేశారు. అనంతరం ఆర్ట్స్ కాలేజీ డ్రామా హాల్ లో "భారత ప్రజాస్వామ్యం విద్యార్థుల పాత్ర" అనే అంశంపై జరిగిన సదస్సులో వక్తలు ప్రసంగించారు. ఈ సందర్భంగా కృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం విశ్రాంత అధ్యాపకులు రాచపాళెం చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ నేడు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యా రంగాన్ని పూర్తిగా ప్రైవేట్ సంస్థలకు అప్పగించి ప్రభుత్వ విద్యా రంగాన్ని నాశనం చేస్తున్నారని, పేద వర్గాల విద్యార్థులను ఉన్నత విద్యకు దూరం చేస్తున్నారని విమర్శించారు. ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే, శీరిగే మాజీ చైర్మన్ వై.విశ్వేశ్వర రెడ్డి మాట్లాడుతూ నేడు కేంద్రంలో అధికారంలో ఉన్న ఎన్.డి.ఏ ప్రభుత్వం రాజ్యాంగ వ్యవస్థలను నిర్వీర్యం చేసి, ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసిందని విమర్శించారు. దేశంలో అత్యంత శక్తిమంతురాలైన ప్రధానమంత్రి ఇందిరా గాంధీ కూడా ప్రజా తీర్పును అంగీకరించారని , కానీ నేడు ప్రధాని మోడీ, హోంమంత్రి అమిత్ షా లు ఎన్నికల సంఘాన్ని గుప్పెట్లో పెట్టుకొని ప్రజా తీర్పును అపహాస్యం చేస్తున్నారని ఆయన దుయ్యబట్టారు. దేశంలో మైనారిటీలపై, దళితులపై దాడులు చేస్తూ, అరాచక పాలన కొనసాగిస్తున్నారని ఆయన విమర్శించారు. విద్యార్థులు విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం, అలాగే దేశ రాజ్యాంగ వ్యవస్థల పరిరక్షణ కోసం ఉద్యమించాలని పిలుపు నిచ్చారు. ఏ ఐ ఎస్ ఎఫ్ మాజీ జాతీయ నాయకులు శ్రీనివాసులు నాయుడు మాట్లాడుతూ దేశ స్వాతంత్రం కోసం ఉద్యమించిన ఏకైక విద్యార్థి సంఘం ...మిగతా 4లో...

## వర్షాలు పడకపోయినా చంద్రబాబు దయతో

# అనంతపురం జిల్లాకు నీరు వచ్చింది

**తాడిపత్రిఅర్బన్, ఆగస్టు 12 ప్రభాతవార్త**

ఈ ఏడాది వర్షాలు పడకపోయినా చంద్రబాబునాయుడు దయతోనే అనంతపురం జిల్లాకు నీరు వచ్చిందని మాజీ ఎమ్మెల్యే జె.సి ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. స్థానిక నివాసంలో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ కర్నూలు జిల్లా నుంచి హంద్రీనీవా కాలువ ద్వారా హెచ్ఎల్‌సి కాలువకు నీళ్లు వచ్చాయని, వర్షాలు లేకపోయినా చంద్రబాబునాయుడు దేవుడి కరుణతో నీళ్లు వచ్చాయన్నారు. రైతాంగం బాగుంటేనే గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలపడుతుందని, నీటి విషయంలో అధికారులు, ప్రజా ప్రతినిధులు కఠినంగా వ్యవహరించాలన్నారు. హెచ్ఎల్‌సి కాలువ ద్వారా నీళ్లు వచ్చిన నేపథ్యంలో జె.సి ప్రభాకర్‌రెడ్డి స్పందించారు. ఎల్‌నినో ప్రభావం ఉంటుందని ప్రజలను భయభ్రాంతులకు గురి చేయవద్దని సూచించారు. రైతాంగం సరిగ్గా లేకపోతే ప్రజల జీవనం కష్టంగా మారుతుందన్నారు. తాడిపత్రిలో వ్యాపార పరిస్థితులు కూడా ఆందోళనకరంగా ఉన్నాయన్నారు. 15 రోజుల క్రితం 8 షాపులు మూతపడగా, ప్రస్తుతం ఆ సంఖ్య 22కు చేరిందన్నారు. గ్రామాల్లో డబ్బులు లేకపోవడంతో పట్టణాల్లో వ్యాపారాలు కూడా దెబ్బతింటున్నాయన్నారు. హెచ్ఎల్‌సి ఏఈలు, ఎస్ఈలతో మాట్లాడగా ఈసారి చాలా ఆలోచించి తాగునీటికి మాత్రమే నీళ్లు అందించే పరిస్థితి ఉందని చెప్పారన్నారు. గండికోట నీళ్లతో మరో రెండు నెలలు నిల్వ ఉండే అవకాశం ఉందని, తాను తన గురించి కాకుండా ప్రజలందరి గురించి ఆలోచిస్తున్నా నన్నారు. తాడిపత్రి ప్రాంతం కాలువ చివరిన ఉండటంతో నీటి విడుదల సమయంలో పోలీస్ రక్షణ ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంటుంద న్నారు. కాలువపై ఉన్న ప్రాంతాల్లో నీళ్లు కనిపిస్తే రైతులు మోటార్లు వేసుకుని వినియోగించుకునే అవకాశం ఉందని, అలాంటి పరిస్థితులను ఎలా నియంత్రించాలన్న దానిపై అందరూ కలిసి చర్చించుకోవాలన్నారు. పుట్లూరు, యల్లనూరు మండలాల్లో తాగునీటి సమస్యలు తలెత్తే అవకాశం ఉందని జె.సి హెచ్చరించారు. పెనకచర్ల డ్యాంలను నింపేందుకు అందరూ కృషి చేయాలని కోరారు. ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు, మంత్రి పయ్యావుల కేశవ్ నీటి విషయంలో కాస్త కఠినంగా వ్యవహరించాలని విజ్ఞప్తి చేశారు. నీళ్లు ఉన్నప్పుడే జాగ్రత్తలు తీసుకోవాలని, చేతులు కాలాక ఆకులు పట్టుకుంటే ప్రయోజనం ఉండదని జె.సి వ్యాఖ్యానించారు. అన్ని డ్యాములను నింపేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు కలిసికట్టుగా పనిచేయాలని, మన ప్రజలకు తాగునీరు అందించాలంటే అందరూ కష్టపడాల్సిందేనని ఆయన తెలియజేశారు.



మీడియాతో మాట్లాడుతున్న జె.సి ప్రభాకర్‌రెడ్డి

# సీడ్ బాల్స్‌తో పచ్చదనం పెంచడమే ప్రభుత్వ లక్ష్యం

**- పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత - డ్రోన్ ద్వారా సీడ్ బాల్స్ వెదజల్లుట ప్రారంభించిన మంత్రి సవిత..**



సీడ్ బాల్స్ వెదజల్లే డ్రోన్ ను ప్రారంభిస్తున్న మంత్రి సవిత

**పెనుకొండ ఆగస్టు 12 ప్రభాతవార్త**

పెనుకొండ అటవీ శాఖ ఆధ్వర్యంలో సీడ్ బాల్స్‌ను డ్రోన్‌ల ద్వారా వెదజల్లే కార్యక్రమాన్ని బుధవారం పెనుకొండ లోని జాతీయ రహదారి పక్కన ఉన్న కొండ ప్రాంతం లో మంత్రి సవిత, కలెక్టర్ శ్యాంప్రసాద్, డీఎఫ్ఓ చక్రపాణి, ఆర్డీవో ఆనంద్ కుమార్ తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో మంత్రి సవిత మాట్లాడుతూ పర్యావరణాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని, రాష్ట్రంలో పచ్చదనాన్ని పెంచేందుకు సీడ్ బాల్స్ కార్యక్రమాన్ని విస్తృతంగా చేపడుతున్నామని ఆమె తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా సీడ్ బాల్స్ ద్వారా పచ్చదనాన్ని పెంపొందించే కార్యక్రమం కొనసాగుతోందని మంత్రి తెలిపారు. సత్యసాయి జిల్లాలో సుమారు13లక్షల సీడ్ బాల్స్‌ను113 ప్రాంతాల్లో వెదజల్లేలా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ప్రస్తుతం జిల్లాలో అటవీ విస్తీర్ణం సుమారు 14 శాతం మాత్రమే ఉందని, భవిష్యత్తులో పచ్చదనాన్ని మరింత పెంచాల్సిన అవసరం ఉందన్నారు. కరోనా సమయంలో ఆక్సిజన్ కొరతతో ఎంతోమంది ప్రాణాలు కోల్పోయారని మంత్రి గుర్తుచేశారు. భవిష్యత్తులో ఇలాంటి పరిస్థితులు రాకుండా పర్యావరణ సమతుల్యతను కాపాడేందుకు విస్తృతంగా మొక్కలు నాటాలని సూచించారు. వాతావరణ మార్పుల ప్రభావం ప్రపంచవ్యాప్తంగా కనిపిస్తోందని, అందుకే అడవుల విస్తరణకు ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. పశువుల పేడతో తయారు చేసిన సీడ్ బాల్స్‌లో విత్తనాలను ఉంచి, వాటిని డ్రోన్‌ల ద్వారా అటవీ, బీడు ప్రాంతాల్లో వెదజల్లుతున్నట్లు తెలిపారు. ప్రకృతి సహజంగా వృద్ధి చెందేలా ఈ విధానం ఉపయోగపడుతుందని చెప్పారు. ప్రతి ఒక్కరూ తమ పుట్టినరోజు సందర్భంగా ఒక మొక్క నాటే అలవాటు చేసుకోవాలని, ముఖ్యంగా విద్యార్థులు పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలని మంత్రి సవిత సూచించారు. పెనుకొండ లో నగర వనాల అభివృద్ధికి చర్యలు చేపట్టామని మంత్రి తెలిపారు. హైవే ప్రాంతంలో సుమారు రూ.2 కోట్లతో నగర వనం ఏర్పాటు చేశామని, అదే విదంగా కొండపై కూడా నగర వనం అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. బీడు భూముల్లో పశుగ్రాసం పెంచేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. గత ఐదేళ్లలో అటవీ శాఖను గత ప్రభుత్వం పట్టించుకోలేదని మంత్రి విమర్శించారు. ప్రస్తుతం పచ్చదనం, అటవీ అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ఉపాధి హామీ పథకం ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా మారుమూల గ్రామాల్లో కూడా రహదారుల అభివృద్ధి పనులు చేపట్టామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్, ఆర్డీవో ఆనంద్ కుమార్, డీఎఫ్ఓ చక్రపాణి, ఎఫ్ ఆర్ ఓ శ్రీనివాసరెడ్డి, అటవీ శాఖ అధికారులు, సిబ్బంది, రాష్ట్ర నగర ఉప్పర కార్పొరేషన్ చైర్మన్ వెంకటరమణ, రాష్ట్ర కార్పొరేషన్ డైరెక్టర్లు కేశవయ్య, డివి ఆంజనేయులు, మాజీ జెడ్పిటిసి లు, చల్లపల్లి రామకృష్ణ, నారాయణస్వామి, పెనుకొండ పట్టణ టిడిపి కన్వీనర్స్ శ్రీరాములు, మండల కన్వీనర్లు, బిజెపి సీనియర్ నాయకులు రామకృష్ణ, జనసేన నాయకులు సోమందేపల్లి నాగరాజు, శ్రీదేవి, కార్యకర్తలు, పెద్ద ఎత్తున విద్యార్థులు పాల్గొన్నారు.

## పెళ్లై నెలరోజులే..

# అంతలోనే దారుణ హత్య..!

- రోకలి బండతో కొట్టి చంపిన భర్త
- మృతురాలిది గుంటూరు జిల్లా
- పరారీలో నిందితుడు

**అనంతపురం క్రైమ్ ఆగస్ట్ 12 ప్రభాతవార్త**

దేవుని సన్నిధిలో కేవలం నెలరోజుల కిందట అగ్ని సాక్షిగా పెళ్ళైంది.. అయితే అంతలోనే ఏమైందో.. ఏమో..? భార్యను కల కాలం కంటికి రెప్పలా కాపాడాల్సిన కట్టుకున్న భర్తే కడతేర్చాడు... పరాయి ప్రాంతం నుండి అతన్ని నమ్మి పెళ్లాడి వచ్చిన ఆమెను కిరతకంగా హతమార్చి ఫరారయ్యాడు.. ఈ దారుణ ఘటన అనంతపురం నగరంలోని ఎల్లమ్మ కాలనిలో బుధవారం వెలుగుజూసింది... పోలీసుల కథనం మేరకు... నగరంలోని వన్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఎల్లమ్మ కాలనీలో దారుణం జరిగిపోయింది. గుంటూరు జిల్లాకు చెందిన బండారు శాంతిని శ్రీ సత్య సాయిజిల్లా కొత్తచెరువు మండలానికి చెందిన కురబ మహేష్ లు గత నెల 5 న శ్రీశైలం మల్లన్న సన్నిధిలో ప్రేమ వివాహం చేసుకున్నారు. అయితే వీరు అనంతపురం నగరంలోని ఎల్లమ్మ కాలనిలో ఓ ఇంటిని అద్దెకు తీసుకొని జీవనం సాగిస్తున్నారు. అయితే వీరు కొంతకాలం పాటు బాగానే వున్నారు. అయితే అంతలోనే ఏమి జరిగిందో.. ఏమో... కాని వీరి మధ్య మనస్పర్థలు ఏర్పడ్డాయి. ఈ నేపథ్యంలో బుధవారం వీరికి ఇల్లు అద్దెకిచ్చిన ఇంటి నుండి దుర్వాసన రావడంతో అనుమానం చెందిన ఆ ఇంటి యజమాని పోలీసులకు ఫిర్యాదు చేసాడు. దీంతో వన్ టౌన్ స్టేషన్ సీ ఐ వెంకటేశ్వర్లు, పోలీసు సిబ్బంది వెంటనే అక్కడికి వెళ్ళి పరిస్థితిని సమీక్షించారు. బెడ్ రూమ్ నందు విగత జీవిగా పడి వున్న బండారు శాంతి (30) మృతదేహాన్ని పరిశీలించారు. భార్య భర్తల మధ్య చెలరేగిన మనస్పర్థలు, గొడవల నేపథ్యంలోనే రోకలి బండతో దారుణంగా కొట్టి చంపినట్లు నిర్ధారణకు వచ్చారు. అయితే ఆమె భర్త కురబ మహేష్ ఆమెను హత్య చేసి ఫరారైనట్లు పోలీసులు తెలిపారు. అనంతరం ఆధారాల కోసం ఇంటిని తనిఖీ చేసారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు ప్రారంభించారు. మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం సర్వజన ఆసుపత్రి కి తరలించారు. అయితే ఆమె దారుణ హత్యకు గురైన కారణాలు తెలియరాలేదు. ఫరారీలో వున్న నిందితుడు కురబ మహేష్ కోసం గాలింపు చర్యలు చేపట్టారు. నిందితుడు దొరికితే పూర్తి వివరాలు తెలుస్తాయని పోలీసులు తెలిపారు.






ఆధారాల సేకరిస్తున్న పోలీసులు

# కదిరిలో రౌడీ షీటర్ శివ కుటుంబం ఆత్మహత్యయత్నం

- రౌడీషీటర్ శివపై అరెస్టు వారెంట్ జారీ చేసిన ఎస్సీ, ఎస్టీ కోర్టు
- అరెస్టు చేయడానికి వెళ్లిన పోలీసులపై తిరగబడిన శివ కుటుంబం



సిఐతో వాగ్వివాదం దిగిన రౌడీ షీటర్ శివ తండ్రి చంద్రశేఖర్

**కదిరి, ఆగస్టు 12 ప్రభాతవార్త**

శ్రీ సత్యసాయి జిల్లా కదిరిలో రౌడీ షీటర్ శివ కుటుంబం ఆత్మహత్య యత్నానికి పాల్పడటం కలకలం రేపింది. వివిధ కేసుల్లో నింధితుడిగా ఉన్న శివ న్యాయ స్థానంలో వాయిదాలకు హాజరు కాకపోవడంతో ఉమ్మడి అనంతపురం జిల్లా ఎస్సీ, ఎస్టీ న్యాయస్థానం శివ అరెస్టుకై అరెస్టు వారెంట్ జారీ చేసింది. దీంతో కదిరి పట్టణ పోలీసులు రౌడీ షీటర్ శివను అరెస్టు చేయడానికి బుధవారం పట్టణ సిఐ వెంకటేశ్వర్లు తన సిబ్బందితో కలిసి వారి నివాసం వద్దకు వెళ్లగా దాదాపు 2 గంటలపాటు వారి ఇంటి వద్ద హై డ్రామా నెలకొంది. రౌడీ షీటర్ శివకుటుంబం ఇంటిలోనే వుండి లోపల గడియ తీయకపోవడంతో పోలీసులు అక్కడ రెండు గంటలపాటు ఉండి పోవాల్సిన పరిస్థితి నెలకొంది. పోలీసులు ఎంత సేపటికీ వెళ్లకపోవడంతో శివ, శివ భార్య యాసికా, తల్లి నరసు మరుగుదొడ్లు శుభ్రంచేసే ద్రావకం తాగి ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డారు. విషయాన్ని గమనించిన పోలీసులు హుటాహుటిన స్థానిక ఏరియా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్య చికిత్స నిమిత్తం అనంతపురంకు తరలించారు. రౌడీ షీటర్ శివ తండ్రి చంద్రశేఖర్ పోలీసులతో వాగ్వివాదానికి దిగడంతోపాటు నానాదుర్భాష లాడాడు. పోలీసు విధులకు ఆటంకం కలిగించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని పట్టణ సిఐ వెంకటేశ్వర్లు తెలిపారు. పలు కేసుల్లో నింధితుడిగా ఉన్న శివ వాయిదాలకు హాజరు కాకపోవడం, అరెస్టు వారెంట్‌తో అరెస్టు చేయడానికి వెళ్లిన పోలీసులపై ఇలా బ్లాక్ మెయిల్ చేయడం తగదన్నారు. పోలీసులకు బ్లాక్‌మెయిల్ చేసినా ఎంతటి వారినైనా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సిఐ స్పష్టం చేశారు.



ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రౌడీ షీటర్ శివ

# రాగులపాడు లిఫ్ట్ నుండి 10 పంపులతో నీటి ఎత్తిపోతలు..!

**- 3,020 క్యూసెక్కుల మేర పారుతున్న కృష్ణా జలాలు - జీడిపల్లి జలాశయాన్ని నింపేందుకు అధికారుల చర్యలు**




రాగులపాడు 8వ లిఫ్టు నుండి 10 పంపులతో నీటిని ఎత్తిపోతున్న దృశ్యం, కాలువ నిండుగా ప్రవహిస్తున్న కృష్ణమ్మ

**ఉరవకొండ, ఆగస్టు 12 ప్రభాతవార్త**

రాయలసీమ జిల్లాలకు వరప్రసాదిని అయిన హంద్రీనీవా కాలువ నీటి ఎత్తిపోతలు కొనసాగుతున్నాయి.

ఉరవకొండ నియోజకవర్గంలోని వజ్రకరూరు మండలం రాగులపాడు గ్రామం వద్దగల 8వ లిఫ్ట్ నుండి 10 పంపులతో కృష్ణా జలాలను ఎత్తిపోస్తున్నారు. 10 పంపులను ఆన్ చేయడం ద్వారా హంద్రీనీవా ప్రధాన కాలువలో 3,020 క్యూసెక్కుల నీరు జీడిపల్లి వైపు పరుగులు తీస్తుండటంతో నిండుగా కనిపిస్తోంది. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత హంద్రీనీవా ప్రధాన కాలువను 3,650 క్యూసెక్కుల సామర్థ్యంతో వెడల్పు చేయాలని నిర్ణయించి పనులు ప్రారంభించి కేవలం 100 రోజుల్లో మొదటి దశ కాలువ వెడల్పు పనులు పూర్తి చేసిన విషయం తెలిసిందే. ఈక్రమంలోనే శ్రీశైలం జలాశయం నుండి కాలువకు నీటిని విడుదల చేయగా ఈనెల 10వ తేదీన మధ్యాన్నం 3 గంటల ప్రాంతంలో నీరు 8వ లిఫ్టుకు చేరింది. దీంతో ఒక్కొక్కటిగా మోటార్లు పెంచుతూ ప్రస్తుతం 10 పంపులతో నీటిని ఎత్తిపోతలను కొనసాగిస్తున్నారు. ప్రధాన కాలువ ద్వారా నీరు బెలుగుప్ప మండలం జీడిపల్లి జలాశయంకు వెళుతోంది. 1.68 టీఎంసీల నీటి సామర్థ్యంగల బెలుగుప్ప మండలంలోని జీడిపల్లి జలాశయం నిండిత తరువాత అక్కడి నుండి నీటిని 11.100 టీఎంసీల నీటి నిలువ సామర్థ్యంగల పీఏబీఆర్ జలాశయం విడుదల చేయనున్నట్లు సమాచారం.

## వ్యక్తిగత పరిశుభ్రతతో సంపూర్ణ ఆరోగ్యం

: హెల్త్ అసిస్టెంట్ గోవర్ధన్

రాయదుర్గం టౌన్, ఆగస్టు 12 ప్రభాతవార్త



అవగాహన కల్పిస్తున్న ఆరోగ్య సిబ్బంది

పరిసరాల పరిశుభ్రత తో పాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటించినప్పుడే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని రాయదుర్గం నియోజకవర్గం బొమ్మనహాల్ మండలం హెల్ప్ అసిస్టెంట్ గోవర్ధన్ ఆరోగ్య సిబ్బంది పిలుపునిచ్చారు. బుధవారం మండలంలోని దేవగిరి, ఉద్యహాలు గ్రామాల్లో విస్తృతంగా అవగాహన సదస్సులు నిర్వహించారు. గ్రామ కమిటీల భాగస్వామ్యంతో జిల్లా



దేవిగిరి గ్రామంలో డ్రై డే పై అవగాహన

పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థుల కు పిల్లల ఆరోగ్యం దేశ వికాసానికి సౌభాగ్యం అని బాలల సంపూర్ణ ఆరోగ్య రక్ష అనే నినాదాలతో విద్యార్థుల్లో అవగాహన కల్పించారు. విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. రక్తహీనత నివారణ కోసం ప్రతి గురువారం ఐరన్ టాబ్లెట్స్ ను తీసుకోవాలని ఎడ్యుకేషన్ చేశారు. ప్రతిరోజు ఉదయం రాత్రిలో పళ్ళను శుభ్రంగా కడుక్కోవడంతోపాటు వ్యక్తిగత పరిశుభ్రత తప్పకు ండా పాటించినప్పుడే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమవుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఆదిశేషయ్య, పవన్, ఆరోగ్య కార్యకర్తలు నాగమణి జానకి గోవర్ధన్ ఆశా వర్కర్ ఈరమ్మ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## మురడి ఆంజనేయస్వామిని దర్శించుకొద్దాం రండి

డి.హిరెహాళ్ ఆగస్టు 12 ప్రభాతవార్త



ప్రత్యేక అలంకరణలో మురిడి ఆంజనేయ స్వామి

శ్రావణమాసం మొదలైంది శ్రావణ శనివారం భక్తులు మూడు ఆంజనేయస్వాముల దర్శనార్థమై వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చి దర్శించుకోవడం ఆనవాయితీగ కొనసాగుతోంది. శ్రావణమాసంలో జిల్లాలో ప్రసిద్ధి చెందిన మురడి ఆంజనేయస్వామి తో పాటు మరో రెండు క్షేత్రాలైన నేమకల్లు ఆంజనేయస్వామి, కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి లను ఒకేరోజు దర్శించుకుంటే మహా పుణ్యం లభిస్తుందని భక్తుల నమ్మకం. మురడి ఆంజనేయస్వామి దేవాలయం అనంతపురం జిల్లా, రాయదుర్గం నియోజకవర్గంలోని డి.హిరెహాళ్ మండలం మురడి గ్రామంలో ఉంది. ఈ ఆలయంలో కొలవై ఉన్న ఆంజనేయస్వామి విగ్రహం చాలా ప్రాముఖ్యత కలిగినదని ఇక్కడి స్వామివారిని సజీవ ఆంజనేయుడిగ భక్తులు భావిస్తారు. మురడి, నేమకల్లు, కసాపురం ఆంజనేయస్వామి వారి విగ్రహాలను శ్రీ వ్యాసరాయులు ఒకే సమయంలో ప్రతిష్ఠించారని ఆయన విజయనగర రాజు కృష్ణదేవరాయల కాలంలో రాజగురువుగ కొనసాగుతున్న కాలంలో ఈ ఆంజనేయ స్వాముల విగ్రహాలను ప్రతిష్ఠించినట్లు చరిత్ర చెబుతోంది. సొంత వాహనాల్లో వెళ్లే భక్తులు రాయదుర్గం నుండి పల్లెపల్లి బస్టాండ్ వద్ద ఏర్పాటుచేసిన ఆంజనేయస్వామి వారి ఆర్చ్ కింద నుండి మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న స్వామివారి ఆలయం చేరుకొని స్వామివారిని దర్శించుకోవచ్చు. ఏర్పాట్లుపూర్తి ఆలయ ఈవో నరసింహారెడ్డి, ఎంపీటీసీ బోయ గంగాధర, స్వామి వారి భక్తి మండలి సభ్యుల ఆధ్వర్యంలో స్వామి వారి దర్శనార్థం వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా ఆలయ ప్రాంగణంలో భారీకేడ్లను ఏర్పాటుచేసి వరస క్రమంలో వెళ్లేల చర్యలు చేపట్టి వర్షం వచ్చిన భక్తులు తడవకుండ పై కప్పు ఏర్పాటు చేసి జాగ్రత్తలు చేపట్టు ఉన్నట్లు వారు చెప్పారు. స్వామివారి దర్శ నార్తం విచ్చేసి భక్తులు వాహనాలను ఉంచుకునేందుకు పార్కింగ్ సౌకర్యాన్ని కల్పించినట్లు ఆలయ ఈవో, ఎంపీటీసీ తెలిపారు. భక్తులు మురిడి ఆంజనేయ స్వామిని దర్శించుకున్న అనంతరం డి. హిరెహాళ్ మండల కేంద్రం సమీపంలోని హిర్దేహాళ్ మీదుగా నేమకల్లు ఆంజనేయస్వామి, గుంతకల్లు సమీపంలోని కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి దర్శనార్థం వెళ్లాల్సి ఉంటుంది. రాయదుర్గం ఆర్టీసీ డిపో వారు ప్రత్యేక బస్సుల ద్వారా మూడు ఆంజనేయ స్వాముల దర్శనార్థం భక్తులను చేరవేస్తారు.

## నేషనల్ మెరిట్ స్కాలర్ షిప్ కు నూతిమడుగు విద్యార్థులు ఎంపిక

కంబదూరు, ఆగస్టు 12, ప్రభాతవార్త

ఇటీవల నిర్వహించిన నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్ షిప్ ఎన్ఎంఎంఎస్ పరీక్ష ఫలితాల్లో కంబదూరు మండలం నూతిమడుగు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు సత్తా చాటారు. కంబదూరు మండలంలో మొత్తం ఆరుగురు విద్యార్థులు ఎంపిక కాగా, వారిలో ఐదుగురు నూతిమడుగు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులే కావడం విశేషం. ఎన్ ఎం ఎం ఎస్ స్కాలర్ షిప్‌కు అశ్విత్ కుమార్, దాసరి నిహాస్ యాదవ్, ఋషిక్ ధవన్, నిహారిక, జాహ్నవి ఎంపికయ్యారు. మండలంలో ఎంపికైన ఆరుగురిలో ఐదుగురు ఒకే పాఠశాలకు చెందిన వారు కావడం పాఠశాలకే కాకుండా నూతిమడుగు గ్రామానికి, కంబదూరు మండలానికి గర్వకారణమని మండల విద్యాశాఖ అధికారులు ఉమాపతి, మదన్ మోహన్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా బుధవారం వారు మాట్లాడుతూ విద్యార్థుల విజయానికి ప్రధానోపాధ్యాయులు రాజశేఖరరెడ్డి, ఉపాధ్యాయ బృందం కృషి అభినందనీయమన్నారు. విద్యార్థులకు సరైన మార్గదర్శకత్వం, ఉపాధ్యాయుల ప్రోత్సాహం, పట్టుదలతోనే ఈ ఘనత సాధ్యమైందని తెలిపారు. ఎన్ఎంఎంఎస్‌కు ఎంపికైన విద్యార్థులకు ఏటా రూ.12 వేల చొప్పున నాలుగేళ్ల పాటు స్కాలర్ షిప్ అందుతుందని ప్రధానోపాధ్యాయులు రాజశేఖరరెడ్డి తెలిపారు. విద్యార్థుల విజయంపై పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తూ ఎంపికైన విద్యార్థులను అభినందించారు.

## ఇంటింటికీ తెలుగుదేశం పార్టీ కార్యక్రమం



సంక్షేమ పథకాలను వివరిస్తున్న దృశ్యం

గుడిబండ ఆగస్టు 12 ప్రభాతవార్త

మండల పరిధిలోని చిగతుర్పి గ్రామంలో ఇంటింటికీ తెలుగుదేశం పార్టీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తెదేపా మండల అధ్యక్షులు లక్ష్మినరసప్ప, సింగిల్ విండో అధ్యక్షుడు మద్దనకుంటప్ప, ఎస్సీ సెల్ అధ్యక్షుడు మంజునాథ్ మాజీ ఎంపిటిసి భోజరాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు ఇంటింటికీ వెళ్లి అభివృద్ధి పత్రాలను పంపిణీ చేస్తూ కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ భరోసా పింఛన్లు, తల్లి వందనం, దీపం2, స్త్రీ శక్తి, అన్న క్యాంటీన్లలో రూ.5కే భోజనం, ఆటో డ్రైవర్లకు ఏటా రూ.15 వేల ఆర్థిక సాయం వంటి పథకాల గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో తెలుగుదేశంపార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఘనంగా హర్ ఘర్ తిరంగా ర్యాలీ




విద్యార్థులు ర్యాలీలో పాల్గొన్న దృశ్యం

కళ్యాణదుర్గం టౌన్, ఆగస్టు 12, ప్రభాతవార్త

కళ్యాణదుర్గం పట్టణంలోని ఎస్‌వీజీఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో బుధవారం హర్ ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహించారు. విద్యార్థులు జాతీయ జెండాలను చేతబూని దేశభక్తి నినాదాలతో ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ శ్రీధర్ మాట్లాడుతూ.. 80వ భారత స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా ప్రతి ఒక్కరూ తమ ఇళ్లపై జాతీయ జెండాను ఎగురవేయాలని ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని నిర్వహిస్తోందన్నారు. ప్రజల్లో జాతీయ స్పృహ, దేశభక్తి, ఐక్యతను పెంపొందించడంతో పాటు జాతీయ జెండాపై గౌరవం, అవగాహన కల్పించడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని తెలిపారు. స్వాతంత్ర్య దినోత్సవానికి ముందు ప్రతి పౌరుడు తమ నివాసాలపై త్రివర్ణ పతాకాన్ని ఎగురవేసి దేశభక్తిని చాటాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు వనిజ, రాధాకృష్ణ, జేకేసీ మెంటార్ అనిల్, భాషతో పాటు ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.

## క్రీడా పోటీల్లో రాష్ట్ర స్థాయికి ఎన్నికైన బికే సునిత



కబడ్డీ పోటీల్లో గెలుపొందిన విధ్యార్థిని సునీత

గుమ్మఘట్ట ఆగస్టు 12 ప్రభాతవార్త

అనంతపురం జిల్లా కేంద్రములో క్రీడా పోటీల్లో పూలకుంట విద్యార్థిని బికే సునిత సత్తా చాటింది అమరావతి ఛాంపియన్ షిప్ బాలికల అండర్ కబడ్డీ పోటీలు నిర్వహించారు అందులో మండలం లోని పూలకుంట గ్రామానికి చెందిన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని ప్రతిభ కనబరిచిందని విజయవాడ లో జరిగేటువంటి రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటుందని ప్రధానోపాధ్యాయులు ఆనంద రావు, ఉపాధ్యాయులు కె రామాంజనేయులు, తెలిపారు

## కమిషనర్ చొరవతో ట్రాఫిక్ సిగ్నల్స్

### ట్రాఫిక్ నిబంధనలు పాటించండి : మల్లికార్జున



సిగ్నల్స్ ను ప్రారంభిస్తున్న కమిషనర్

హిందూపురం ఆగస్టు 12 ప్రభాతవార్త

హిందూపురం చరిత్రలో మొట్ట మొదటిసారిగా ట్రాఫిక్ సిగ్నల్ వ్యవస్థను మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున చొరవతో ఏర్పాటు చేశారు. ఇప్పటికే రహమత్ పురం సర్కిల్లో సిగ్నల్స్ వ్యవస్థ ప్రారంభం కాగా తాజాగా బుధవారం అంబేద్కర్ సర్కిల్లో వీటిని లాంఛనంగా కమిషనర్ ప్రారంభించారు. గురువారం గురునాథ్ సర్కిల్లో మరో సిగ్నల్ పాయింట్ ను ప్రారంభించనున్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పట్టణంలో ట్రాఫిక్ నియంత్రణను మెరుగుపరచడం, వాహనదారులు, పాదచారుల భద్రతను పెంపొందించడం, రహదారి ప్రమాదాలను నివారించడం లక్ష్యంగా ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు చేయడం జరిగిందని చెప్పారు. కావున వాహనదారులు తప్పనిసరిగా ట్రాఫిక్ సిగ్నల్స్‌ను, ట్రాఫిక్ నిబంధనలను పాటించాలని సూచించారు. పాదచారులు కూడా రహదారి దాటే సమయంలో జాగ్రత్తలు పాటించాలని కోరారు. ప్రజల సహకారంతోనే ట్రాఫిక్ క్రమబద్ధీకరణ సాధ్యమవుతుందని ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించి, సురక్షితమైన హిందూపురం పట్టణ నిర్మాణానికి సహకరించాలని పిలుపునిచ్చారు.

## పొలం పిలుస్తుంది




పొలం పిలుస్తుంది కార్యక్రమం దృశ్యం

బ్రహ్మ సముద్రం ఆగస్ట్ 12 ప్రభాతవార్త

బ్రహ్మసముద్రం మండల పరిధిలోని భైరసముద్రం గ్రామం నందు ఏ ఓ గోపాల్ ఆధ్వర్యంలో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు ఈ సన్దర్భంగా వ్యవసాయ అధికారి గోపాల్ మాట్లాడుతూ సస్య రక్షణ ఎరువుల వాడకం ఎలిని నో ప్రభావం వల్ల రైతు నష్టపోకుండా పంట లపై ఇన్సూరెన్స్ తదితర విషయాలపై రైతులకు అవగాహన కల్పించారు.

## విద్యా హక్కుల సాధనే లక్ష్యం




బహుమతులు అందజేస్తున్న మూర్తి

హిందూపురం టౌన్ ఆగస్టు 12 ప్రభాతవార్త

విద్యా హక్కుల సాధనే లక్ష్యంగా ఏఐఎస్ఎఫ్ పనిచేస్తుందని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు నరసింహమూర్తి తెలిపారు. ఏఐఎస్ఎఫ్ 91వ ఆవిర్భావం సందర్భంగా పట్టణంలో ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా నరసింహమూర్తి జెండా ఆవిష్కరించారు. ఏఐఎస్ఎఫ్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా విద్యార్థిని, విద్యార్థులకు క్రీడలు నిర్వహించారు ఈ క్రీడలలో ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా నరసింహమూర్తి మాట్లాడుతూ విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ భవిష్యత్తుపై దృష్టి సారించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు బద్రీనాథ్, అభి, గౌరీ శంకర్, అర్జున్, దినేష్, వంశీ, అజయ్, లక్ష్మినారాయణ, మోహన్, అభిలాష్, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఘనంగా చౌడేశ్వరి మాత జయంతి ఉత్సవాలు

హిందూపురం ఆగస్టు 12 ప్రభాతవార్త



ప్రత్యేక అలంకరణలో చౌడేశ్వరి మాత

హిందూపురం పట్టణంలోని కంసాలిపేటలో వెలసిన దేవాంగం సంఘం సామాజిక వర్గం కులదైవమైన శ్రీ చౌడేశ్వరి మాత, శ్రీ విరుపాక్షేశ్వర దేవతా మూర్తుల జయంతోత్సవాలు బుధవారం ఘనంగా నిర్వహించారు. వేద పండితుల మధ్య హోమాలు విశేష పూజలు నిర్వహించారు. మొదట అమ్మవారికి వివిధ అభిషేకాలు నిర్వహించి అనంతరం ప్రత్యేక పుష్పాలతో అలంకరించారు. ప్రజలు సుఖ సంతోషాలతో జీవించాలని ఈ సందర్భంగా నిర్వాహకులు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ కార్యవర్గ సభ్యులు దేవాంగం సంక్షేమ సంఘం సోమశేఖర్, కార్యదర్శి నంజుండప్ప, కోశాధికారి రాజశేఖర్, దేవాంగం శంకరప్ప, విశ్వమూర్తి, చలపతి, రాజమ్మ, పురోహితులు ప్రకాష్, కృష్ణ, శ్రీనివాస్, భక్తులు పాల్గొన్నారు.

## జ్ఞానజ్యోతితో చిన్నారుల సమగ్రాభివృద్ధి



అంగన్వాడీ కార్యకర్తలకు జ్ఞాన జ్యోతి శిక్షణ ఇస్తున్న దృశ్యం

మడకశిర టౌన్, ఆగస్టు 12 ప్రభాతవార్త

ఐదేళ్లలోపు చిన్నారుల సమగ్ర అభివృద్ధి కోసమే జ్ఞాన జ్యోతి శిక్షణ ఇస్తున్నట్టు ఇంచార్జ్ ఇంచార్జ్ సీడీపీవో రాధా, డి ఆర్ పి సురేంద్ర, సూపర్వైజర్ శ్రీదేవి లు తెలిపారు. బుధవారం అంగన్వాడీ కార్యకర్తలకు పట్టణంలోని జడ్పీ జిహెచ్ఎస్ స్కూల్లో ఏర్పాటు చేసిన జ్ఞానజ్యోతి శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిడిపిఓ రాధ, డి ఆర్ పి, సురేంద్ర, సూపర్వైజర్ శ్రీదేవి లు మాట్లాడుతూ... అంగన్‌వాడీ కేంద్రాల్లోని పిల్లలకు ఆటపాటలతో విద్యను నేర్పే విధానం లో మెళకువలను ఈ శిక్షణ కార్యక్రమం ద్వారా అందిస్తారని తెలిపారు. అభ్యాసనా నైపుణ్యాలు పెంపొందిస్తారన్నారు. ఆటపాటలు బొమ్మల ద్వారా చిన్నారులకు మెరుగైన బోధన అందించడమే లక్ష్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో మధుసూదన్. అంగన్వాడి కార్యకర్తలు పాల్గొన్నారు.

## వైద్య, ఆరోగ్య రంగంలో నాణ్యమైన సేవలందించాలి

: జిల్లా కలెక్టరు ఏ.శ్యామ్ ప్రసాద్





వైద్య, ఆరోగ్య రంగంలో నాణ్యమైన సేవలందించాలి

పుట్టపర్తి (వైద్యం) ఆగస్టు, 12 ప్రభాతవార్త

ప్రభుత్వ వైద్యం పై ప్రజల్లో నమ్మకం, పెరిగేలా వైద్య అధికారులకు సూచించిన జిల్లా కలెక్టరు బుధవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలు నుండి జిల్లాలోని వివిధ ప్రాథమిక, ద్వితీయ శ్రేణి వైద్య అధికారులతో వివిధ ఆరోగ్య సూచీలపై కలెక్టరు సమగ్ర సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టరు మాట్లాడుతూ జిల్లాలో ప్రతీ ఆరోగ్య సూచీలో నిర్దేశిత లక్ష్యాలను చేరుకోవాలని సూచించారు. ఐవిఆర్ఎస్ వ్యవస్థ ద్వారా సేకరిస్తున్న ప్రజాభిప్రాయంలో సానుకూల ఫలితాలు సాధించేలా ఆసుపత్రుల్లో సేవలు మెరుగుపరచాలి. మాతృ మరణాల రేటు, శిశు మరణాల రేటు తగ్గించేందుకు గర్భిణులు, బాలింతలకు క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు, పోషకాహారం అందించేలా క్షేత్రస్థాయి సిబ్బంది నిరంతరం పర్యవేక్షించాలి. కుటుంబ నియంత్రణ విధానాలపై ప్రచారం పెంచి అర్హులకు అవగాహన కల్పించాలి. క్షయ రహిత సమాజ నిర్మాణం కోసం జాతీయ క్షయ నిర్మూలన కార్యక్రమాన్ని వేగవంతం చేయాలి. జాతీయ కుష్టు నిర్మూలన కార్యక్రమం (విలినిశి) ఎయిడ్స్ (తిదీళీ) నియంత్రణపై విస్తృత అవగాహన సదస్సులు, పరీక్షలు నిర్వహించాలి. వైద్య సేవల్లో ఎలాంటి అలసత్వం వహించినా సహించేది లేదని, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల నుండి జిల్లా ప్రధాన ఆసుపత్రి వరకు మౌలిక సదుపాయాలు, మందుల కొరత లేకుండా చూసుకోవాలని కలెక్టరు అధికారులను ఆదేశించారు. జిల్లాలోని మెడికల్ షాపుల్లో గైనకాలజిస్ట్ వైద్యుల అధికారిక ప్రిస్క్రిప్షన్ లేకుండా మందులు విక్రయించరాదని స్పష్టం చేశారు. నిబంధనలు ఉల్లంఘించే మెడికల్ షాపులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఔషధ నియంత్రణ అధికారులను ఆదేశించారు. కౌమారదశలో వచ్చే అనర్థాలు, టీనేజ్ ప్రెగ్నెన్సీ వల్ల కలిగే ఆరోగ్య సమస్యలపై జిల్లాలోని పాఠశాలలు, కళాశాలల్లో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. జిల్లాలో నూతనంగా రూపుదిద్దుకున్న ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ (ఆరోగ్య కేంద్రాల) భవనాలను వైద్య అధికారులు తక్షణమే స్వాధీనం చేసుకుని, ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. జిల్లాలో మాతృ మరణాలు, శిశు మరణాలు సంఖ్యను గణనీయంగా తగ్గించాలని స్పష్టం చేశారు. గర్భిణులు, బాలింతలకు అందించే వైద్య పర్యవేక్షణలో ఎలాంటి అలసత్వం వహించకూడదని హెచ్చరించారు. ఈ సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డి ఎం హెచ్ ఓ డాక్టర్ ఫైరోజా బేగం, సంబంధిత శాఖల ప్రోగ్రామ్ ఆఫీసర్లు, డివిజనల్ మెడికల్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

## ఎన్ ఎం ఎం ఎస్ మెరిట్ స్కాలర్ షిప్ ఎంపికైన విద్యార్థి



బెలుగుప్ప ఆగస్టు 12 ప్రభాతవార్త

బెలుగుప్ప మండల పరిధిలో గంగవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న జ్ఞానేశ్వరి ఎన్ ఎం ఎం ఎస్ మెరిట్ స్కాలర్ షిప్ ఎంపికైన విద్యార్థిని ప్రధానోపాధ్యాయుడు రామాంజనేయులు ఉపాధ్యాయ బృందం అభినందించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు రామాంజనేయులు మాట్లాడుతూ పరీక్షలు నందు మంచి మార్కులు సాధించడం వల్ల ఎంపికైందని తెలిపారు మిగతా విద్యార్థులు ఈ అమ్మాయి ఆదర్శంగా తీసుకొని 8వ తరగతి చదువుతున్న విద్యార్థులు ఇలాగే మంచి మార్కులు తీసుకుని మీరు కూడా ఈ ఎన్ ఎం ఎం ఎస్ స్కాలర్ షిప్ ని సాధించాలని విద్యార్థులకు తెలియజేశారు ఈ కార్యక్రమంలో స్కూల్ కమిటీ చైర్మన్ రహీం తదితరులు పాల్గొన్నారు.

## చౌడేశ్వరి అమ్మవారి జయంతోత్సవం

- వివిధ ఆలయాల్లో కొనసాగిన విశేష అభిషేకాలు, ప్రత్యేక పూజలు
- అమ్మవారిని దర్శించుకున్న వేలాది మంది భక్తులు, కొనసాగిన అన్నదానం



ప్రత్యేకాలంకరణలో అమ్మవారు



విశేషాలంకరణలో అమ్మవారు



అమ్మవారిని దర్శించుకొంటున్న భక్తులు

ఉరవకొండ, ఆగస్టు 12 ప్రభాతవార్త

ఉరవకొండలో స్వస్తిశ్రీ పరాభవనామ సంవత్సరం ఆషాడ అమావాస్య బుధవారం చౌడేశ్వరి అమ్మవారి జయంతోత్సవం అత్యంత భక్తిశ్రద్ధల నడుమ జరిగింది. స్థానిక ఉరగాద్రి చౌడేశ్వరి ఆలయంలో ఆలయ ఛైర్మెన్ కొత్త శరత్ ఆధ్వర్యంలో ఉదయం అమ్మవారికి విశేష అభిషేకాలు, అలంకరణ, పూజలు, మహా మంగళహారతి కార్యక్రమాలు, మధ్యాన్నం అన్నదానం, సాయంత్రం పల్లకీ ఉత్సవం నిర్వహించారు. చౌడేశ్వరి కాలనీలోని తొగటవీర క్షత్రియ చౌడేశ్వరి ఆలయంలో ఉదయం గణపతి, సుబ్రమణ్యేశ్వరస్వామి పూజ, నవగ్రహ ఆరాధన, గంగాజల, పంచామృత అభిషేకాలు, ఉత్సవమూర్తికి సామూహిక క్షీరాభిషేకం, బోనాల సమర్పణ, మహా మంగళహారతి, మధ్యాన్నం అన్నదానం, సాయంత్రం ఉంజల్ సేవ కొనసాగింది. అదేవిధంగా 11వ వార్డులోని చౌడేశ్వరి, పెద్ద చౌడప్ప, పురమానుకట్ట చౌడమ్మ తదితర ఆలయాల్లోనూ విశేష పూజలు కొనసాగాయి. భక్తులు వేలాదిగా తరలివచ్చి అమ్మవారిని దర్శించుకొని పూజలు, అర్చనలు చేయించగా వారికి తీర్థప్రసాదాలతో పాటు అన్నదానం కార్యక్రమాలు జరిగాయి.

## రేపటి నుండి ఉండబండ వీరభద్రస్వామి బ్రహ్మోత్సవాలు

- 18న స్వామివారి రథోత్సవం, 19న లంకాదహనం
- సర్వాంగ సుందరంగా ముస్తాబైన ఆలయం



వీరభద్రస్వామి మూలవిరాట్



భద్రకాళీ అమ్మవారు

ఉరవకొండ, ఆగస్టు 12 ప్రభాతవార్త

ఉరవకొండ నియోజకవర్గ పరిధిలోని విడపనకల్లు మండలం పాల్తూరు గ్రామంలో వెలసిన ఉండబండ వీరభద్రస్వామి బ్రహ్మోత్సవాలు స్వస్తిశ్రీ పరాభవనామ సంవత్సరం శ్రావణ మాసం శుక్లపక్ష విదియ ఈనెల 14వ తేదీ శుక్రవారం నుండి సప్తమి 19వ తేది సప్తమి బుధవారం వరకు జరుగుతాయని ఆలయ కార్యనిర్వహణ అధికారి కె.విజయ్‌కుమార్, అన్నదాన కమిటీ అధ్యక్షులు దండిన శివానంద, బ్రహ్మోత్సవ కమిటీ సభ్యులు పి.శశిధర్‌గౌడ్, కె.రుద్రప్ప, వి.వీరభద్ర ఆచారి, అర్చకులు తెలిపారు. ఇందుకోసం ఆలయాన్ని సర్వాంగ సుందర్బంగా ముస్తాబు చేశారు. 14న శుక్రవారం ధ్వజారోహణంతో ఉత్సవాలకు అంకురార్పణ జరుగనుండగా సాయంత్రం గజ వాహనసేవ జరుగనుంది. 15న శనివారం శేషవాహన సేవ, 16న ఆదివారం మయూర వాహన సేవ, 17న నంది వాహన సేవ జరుగనుంది. 18న సాయంత్రం 5 నుంచి 5.30 గంటల మధ్య భక్తుల విరాళాలు దాదాపు 30 లక్షల రూపాయలతో నూతనంగా తయారు చేయించిన రథంతో రథోత్సవం కొనసాగనుంది. ఉదయం స్వామివారి కళ్యాణోత్సవం జరుగనుంది. 19న బుధవారం లంకా దహన కార్యక్రమంలో ఉత్సవాలు ముగియనునాన్నయి. 9 శతాబ్దాల చరిత్ర కల్గిన ఉండబండ వీరభద్రస్వామి ఆలయం : దాదాపు 9 శతాబ్దాల క్రితం ప్రస్తుతం వజ్రకరూరు మండలం కొనకొండ్ల గ్రామం ఉన్న ప్రాంతంలో ఒక మఠం దాని ప్రాంగణంలో ఒక పురాతన శివాలయం ఉండేది. అక్కడే ఒక శివ భక్తుడు వ్యవసాయంచేసి జీవిస్తుండేవాడు. ఒకరోజు అతను పొలంలో దుక్కిదున్నుతుండగా నాగలిమడక కర్రకు ఒకరాయి తగలడంతో నాగలి ముందుకు కదలకుండా ఆగిపోయింది. వెంటనే ఆ ప్రాంతంలో తవ్విచూడగా స్వామివారి విగ్రహం బయటపడింది. ఆ విగ్రహాన్ని బయటకుతీసి మట్టిని శుభ్రం చేసి రైతు భోజనంచేసి నిద్రకు ఉపక్రమించాడు. అప్పుడు స్వామివారు అతనికి కలలో అగుపించి తాను వీరభద్రుడినని, తనను ఎద్దులబండిలో వేసుకొని తాను బయటపడిన వ్యతిరేఖ దిక్కుకు పశ్చిమమునకు తీసుకెళ్లాలని తాను కదలకుండా ఎక్కడ ఆగిపోతే అక్కడ తన విగ్రహాన్ని ప్రతిష్ఠించాలని ఆ క్షేత్రంలో కొలువై తాను భక్తులతో పూజలందుకుంటూ వారి కష్టాలను తీర్చుతానని ఆదేశించారని చెబుతారు. శ్రీవారి కోరిక మేరకు ఆరైతు తన ఎద్దుల బండిలో శ్రీవారి విగ్రహాన్ని వేసుకొని బయలుదేరి వెళ్లాడు. అలా వెళ్లుండగా ఆకలి కావడంతో ప్రస్తుతం ఉండబండ క్షేత్రం ఉన్న ప్రాంతంవద్ద ఆగాడు. అన్నం తిన్న తరువాత తిరిగి వెళ్లడానికి ప్రయత్నించగా ఆ ఎద్దులబండి ముందుకి కదలలేదు. అప్పుడు స్వామివారు ఆకాశవాణి రూపంలో తనను అక్కడే ప్రతిష్ఠించాలని ఆదేశించడంతో శ్రీవారి కోరిక మేరకు ఆ రైతు స్వామివారి విగ్రహాన్ని అక్కడే ప్రతిష్ఠింపజేశాడు. నాటి నుండి నేటి వరకు ఇక్కడ కొలువుదీరిన ఉండబండ వీరభద్రస్వామి నిత్యపూజలందుకుంటూ భక్తుల కష్టనష్టాలను తీర్చుతూ ఉన్నాడు. ఇందుకు ఆలయంలో నాడు బండికి ఉపయోగించిన ఇనుమ కమ్మీలు నేటికీ ఆగుపిస్తాయి. అంతేకాక శ్రీవారి విగ్రహం నుదురుకు నాడు మడక కర్రతగిలినచోట ఏర్పడిన రెండు చిన్నపాటి గీతలు స్పష్టంగా అగుపించడం ఇందుకు ప్రధాన సాక్ష్యాలుగా చెప్పవచ్చు.

## ఉరి వేసుకుని ఇంటర్ విద్యార్థి ఆత్మహత్య

గోరంట్ల, ఆగస్టు 12 ప్రభాతవార్త



హేమశ్రీ (18)

గోరంట్ల పట్టణంలోని కొలిమి చింతమాను వీధిలో నివాసముండే వడ్డే సిద్దయ్య కుమార్తె ఇంటర్ విద్యార్థి వడ్డే హేమశ్రీ (18) బుధవారం తన నివాసంలోనే ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన చోటుచేసుకుంది. వివరాలు ఇలా వున్నాయి. మండలంలోని కొండాపురం పంచాయతీ కాంగారెడ్డిపల్లి గ్రామానికి చెందిన వడ్డే సిద్దయ్య కుమార్తె వడ్డే హేమశ్రీ అనంతపురంలోని ఎస్ఎల్ఎన్ జూనియర్ కాలేజీలో సెకండ్ ఇయర్ చదువుతోంది. ఈ నేపథ్యంలో బుధవారం పట్టణంలోని తన నివాసంలో ఫ్యానుకు చున్నీతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుందని, కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతోందని, దీంతో మనస్థాపం చెంది ఆత్మహత్య చేసుకుందని కుటుంబసభ్యులు తెలిపారు. ఈ సంఘటనపై పోలీసుల దర్యాప్తులో వాస్తవ విషయాలు తెలియాల్సి ఉంది.

03ATP12_03ATP12.qxd 12-08-2026 PM 10:53 Page 1



## ఏఐ ఆధారిత జీఎస్టీ పరిపాలనకు జాతీయ స్థాయి గుర్తింపు

**- చీఫ్ కమిషనర్ అహ్మద్ బాబుకు వాణిజ్య పన్నుల నాన్ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ అభినందనలు**

**అనంతపురం న్యూటౌన్, ఆగస్టు 12 ప్రభాతవార్త**



చీఫ్ కమిషనర్ అహ్మద్ బాబుతో రాష్ట్ర అధ్యక్షులు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

ఆంధ్రప్రదేశ్ వాణిజ్య పన్నుల శాఖలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఎఐ), అడ్వాన్స్‌డ్ అనలిటిక్స్. సాంకేతిక ఆధారిత పరిపాలన ద్వారా చేపడుతున్న వినూత్న కార్యక్రమాలకు జిఎస్టి కౌన్సిల్ ప్రతినిధి బృందం ప్రశంసలు అందించడం పట్ల ది కమర్షియల్ టాక్సెస్ నాన్ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్, ఆంధ్రప్రదేశ్, విజయవాడ హర్షం వ్యక్తం చేసింది. జిఎస్టి కౌన్సిల్ ప్రతినిధి బృందం ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రితో, ప్రిన్సిపల్ సెక్రటరీ ఫైనాన్స్ పియూష్ కుమార్, చీఫ్ కమిషనర్ అహ్మద్ బాబు సమక్షంలో నిర్వహించిన సమావేశంలో రాష్ట్ర జిఎస్‌టి పరిపాలనలో అమలు చేస్తున్న వినూత్న సాంకేతిక కార్యక్రమాలను ప్రత్యేకంగా అభినందించడం రాష్ట్రానికి, వాణిజ్య పన్నుల శాఖకు గర్వకారణమని అసోసియేషన్ పేర్కొంది. ఈ సందర్భంగా చీఫ్ కమిషనర్ ఆఫ్ స్టేట్ టాక్స్, ఆంధ్రప్రదేశ్ అహ్మద్ బాబుకి ది కమర్షియల్ టాక్సెస్ నాన్ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులు భవనారి వెంకటేష్ బాబు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొప్పోలు సుధాకర్ రావు సంఘం పక్షాన హృదయపూర్వక అభినందనలు, శుభాకాంక్షలు తెలియజేశారు. శ్రీ అహ్మద్ బాబు దార్శనిక నాయకత్వం, నవీన ఆలోచనలు, సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగిస్తున్న తీరు వాణిజ్య పన్నుల శాఖను ఆధునిక, పారదర్శక, సమర్థవంతమైన జీఎస్టీ పరిపాలన దిశగా ముందుకు తీసుకెళ్తోందని వారు పేర్కొన్నారు. అదేవిధంగా, ఈ ఆర్థిక సంవత్సరంలో ప్రతి నెలా జిఎస్‌టి ఆదాయంలో మంచి వృద్ధిని సాధిస్తూ మెరుగైన ఫలితాలు నమోదు చేయడంలో చీఫ్ కమిషనర్ నాయకత్వం కీలక పాత్ర పోషిస్తోందని తెలిపారు. కింది స్థాయి అధికారులతో పాటు వారి సిబ్బందిని సమన్వయం చేస్తూ, వారిలో బాధ్యతాభావాన్ని పెంపొందిస్తూ, సమిష్టి కృషితో శాఖను ముందుకు నడిపిస్తున్న తీరు అభినందనీయమని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో అమలు చేస్తున్న ఎఐ ఆధారిత జిఎస్‌టి పరిపాలనా విధానాలను దేశవ్యాప్తంగా ఇతర రాష్ట్రాల్లో అనుసరించదగిన ఉత్తమ పద్ధతులుగా జీఎస్టీ కౌన్సిల్ ప్రతినిధి బృందం గుర్తించడం రాష్ట్ర వాణిజ్య పన్నుల శాఖకు లభించిన విశిష్ట గౌరవమని వారు అన్నారు. చీఫ్ కమిషనర్ అహ్మద్ బాబు నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్ వాణిజ్య పన్నుల శాఖ సాంకేతికత, సమర్థత, పారదర్శకత మరియు మెరుగైన ఆదాయ వృద్ధి దిశగా ముందుకు సాగడం మాకు ఎంతో గర్వకారణం. ఈ జాతీయ స్థాయి గుర్తింపు ఆయన నాయకత్వానికి, అధికారుల సమన్వయానికి, కింది స్థాయి సిబ్బంది సమిష్టి కృషికి నిదర్శనం" అని ది కమర్షియల్ టాక్సెస్ నాన్ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు భవనారి వెంకటేష్ బాబు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొప్పోలు సుధాకర్ రావు పేర్కొన్నారు. వుయ్ ఆర్ ప్రౌడ్ ఆఫ్ యు సార్ అంటూ అంటూ చీఫ్ కమిషనర్ అహ్మద్ బాబుకి వారు ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు.

## వేదవ్యాస జయంతిని అధికారికంగా నిర్వహించాలి

**అనంతపురం కల్చరల్, ఆగస్టు 12 ప్రభాతవార్త**



మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

వేదవ్యాస మహర్షి జయంతిని అధికారికంగా నిర్వహించి సెలవు దినంగా ప్రకటించాలని, అలాగే రాష్ట్రంలోని పలు నగరాలు, పట్టణాలు, మండలాల్లో వేదవ్యాస మహర్షి విగ్రహాలు ఏర్పాటు చేయాలని మత్స్యకార సంక్షేమ సమితి అనంతపురం జిల్లా అధ్యక్షులు జశ్వంత్ వ్యాస్ ప్రభుత్వాన్ని కోరారు. అమరావతిలోని సచివాలయంలో బుధవారం మంత్రి కొల్లు రవీంద్రను మర్యాద పూర్వకంగా కలిసి వినతి పత్రం అందజేశారు. అంతకుముందు మంత్రిని శాలువాతో సత్కరించారు. ఈ సందర్బంగా జశ్వంత్ వ్యాస్ మాట్లాడుతూ.. భారతీయ సంస్కృతి, వేద సంప్రదాయాలకు ఆద్యుడైన మహర్షి వేదవ్యాసుడు ప్రపంచానికి మహాభారతం, భాగవతం, వేదాలు వంటి మహోన్నత గ్రంథాలను అందించిన మహనీయుడు అన్నారు. దీనిపై మంత్రి కొల్లు రవీంద్ర సానుకూలంగా స్పందించినట్లు వారు తెలిపారు. నూతనంగా మత్స్యకార జిల్లా అధ్యక్షులుగా ఎంపిక పట్ల జశ్వంత్ వ్యాస్‌ని అభినందించి మత్స్యకారుల సంక్షేమం కోసం కృషి చేయాలని సూచించారు.

## కట్టకిందపల్లి, సిండికేట్ నగర్‌లో ఘనంగా చౌడేశ్వరి మాత జయంతి ఉత్సవాలు



అమ్మవారికి బోనాలు ఎత్తుకొని వెళుతున్న దృశ్యం.

**అనంతపురం రూరల్, ఆగస్టు 12 ప్రభాతవార్త**

అనంతరం మండలం లోని వివిధ గ్రామాల్లాలో వెలసిన దేవాంగ, తొగట సంఘం సామాజిక వర్గలా కులదైవమైన శ్రీ చౌడేశ్వరి మాత జయంతోత్సవాలు బుధవారం సిండికేట్ నగర్, కట్టకిందపల్లి గ్రామాల్లో ఘనంగా నిర్వహించారు. వేద పండితుల మధ్య హోమాలు విశేష పూజలు నిర్వహించారు. మొదట అమ్మవారికి వివిధ అభిషేకాలు నిర్వహించి అనంతరం ప్రత్యేక పుష్పాలతోఅలంకరించారు. ప్రజలు సుఖ సంతోషాలతో జీవించాలని గ్రామలాలోని ప్రజలు ప్రతి ఒక్కరు భక్తి శ్రద్ధలతో అమ్మవారికి బోనాలు సమర్పించి .సకాలంలో వర్షాలు కురవాలని పాడిపంటలు సంవృద్ధిగా పండాలని.కోరుకుంటూ అమ్మవారికి మ్రొక్కులు తీర్చుకున్నారు. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వచించారు. ఈ కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.

## రేపు మండల సర్వసభ్య సమావేశం

**ఎంపీడీఓ దివాకర్.**

**అనంతపురం రూరల్, ఆగస్టు 12 ప్రభాతవార్త**

అనంత రూరల్ మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల 14 వ తేది శుక్రవారం సర్వసభ్య సమావేశం ఎంపిపి వరలక్ష్మి అధ్యక్షతన నిర్వహించడం జరుగుతుందని కావు న మండలంలోని ఎంపిటిసిలు, జెడ్స్ టిసి, మండల స్థాయి అధికా రులు, పంచాయితీ అభివృద్ధి అధికారులు అందరు హాజరు కావాలని ఎంపిడిఓ దివాకర్ తెలిపారు. అదే విదంగా పంచాయతీ అభివృద్ధి అధికారులు ఎంపీటీసీలకు సమాచారం తెలియజేసి వారు సకాలంలో సమావేశానికి హాజరయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన తెలిపారు.

## ఉపాధ్యాయ అర్హత పరీక్షకు 128 మంది గైర్హాజరు

**అనంతపురం న్యూటౌన్, ఆగస్టు 12 ప్రభాతవార్త**

.ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ఉపాధ్యాయ అర్హత పరీక్ష అనంతపురం జిల్లాలో ఆరు కేంద్రాలలో నిర్వహించారు. ఇందుకు గాను 1645 మంది అభ్యర్థులకుగాను, 1517 మంది అభ్యర్థులు హాజరు కాగా, 128 మంది గైర్హాజరు అయినట్లు జిల్లా విద్యాశాఖ అధికారి ఒక ప్రకటన ద్వాఆర తెలియజేశారు.

## విద్యార్థులకు నాణ్యవంతమైన భోజనం అందించండి

**ఎన్నికల పోలీస్ కేంద్రాలను పరిశీలించిన ఎంపీడీవో విజయలక్ష్మి**




మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీవో విజయలక్ష్మి

**రాప్తాడు ఆగస్టు 12, ప్రభాతవార్త**

విద్యార్థులకు నాణ్యవంతమైన భోజనం అందించాలని రాప్తాడు ఎంపీడీవో విజయలక్ష్మి ఉపాధ్యాయులకు సూచించారు , బుధవారం మండల పరిధిలోని భోగినేపల్లి పాలచర్ల గ్రామాల్లోని ఎన్నికల పోలింగ్ కేంద్రాలను సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులు, విద్యుత్, పరిసరాల పరిశుభ్రత తదితర అంశాలను పరిశీలించారు. అనంతరం పాలచెర్ల గ్రామంలో ఉన్న ఎం పి యు పి పాఠశాలను సందర్శించి,మధ్యాహ్న భోజన పథకం అమలును పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన, పరిశుభ్రమైన మరియు పోషకాహారంతో కూడిన మధ్యాహ్న భోజనం అందించాలని పాఠశాల సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో అశోక్ బాబు ,డిప్యూటీ ఎంపీడీవో శీబిలీజా అచ్యుతానంద బాబు మరియు పంచాయతీ అభివృద్ధి అధికారి భార్గవి తదితరులు పాల్గొన్నారు .

## శింగనమలలో మలేరియా నివారణ చర్యలు



పాఠశాలలో అల్ఫాసైఫా మందు పిచికారి చేస్తున్న దృశ్యం

**శింగనమల, ఆగస్టు 12 ప్రభాతవార్త**

మండల కేంద్రంలో 47 సంవత్సరాలు కలిగిన వ్యక్తికి మలేరియా నిర్ధారణ కావడంతో జిల్లా మలేరియా అధికారి డా.మనోజ్ ఆదేశాల మేరకు మలేరియా సబ్ యూనిట్ సిబ్బంది తరిమెల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది, శింగనమల గ్రామ పంచాయితీ సిబ్బంది మలేరియా నివారణ చర్యలు చేపట్టారు. అందులో భాగంగా, వీధులలో మురుగు నీటి కాలువలు శుభ్ర పర్చడం, బ్లీచింగ్ పౌడర్ చల్లడం, యాంటీ లార్వా స్ప్రేయింగ్ చర్యలు చేపట్టారు. అదే విధంగా కేసు నమోదైన ఇంటి చుట్టుపక్కల, అన్ని గృహాలలో సైఫో నోత్రిన్ అనే మందును పిచికారి చేశారు. చుట్టుపక్క వారి రక్త నమూనాలను సేకరించారు. ఈ కార్యక్రమంలో మలేరియా సబ్ యూనిట్ అధికారి మద్దయ్య, సామాజిక ఆరోగ్య అధికారి గంగాధర, ఆరోగ్య విస్తరణ అధికారి చంద్రశేఖర్‌రెడ్డి, మలేరియా సబ్ యూనిట్ సూపర్ వైజర్లు నూర్ బాషా, శ్రీధర్‌మూర్తి, పంచాయితీ కార్యదర్శి రామ్మోహన్‌రెడ్డి, హెల్త్ అసిస్టెంట్ రమణయ్య, సచివాలయ ఆరోగ్యక ఆర్యదర్శి తస్లీం, ఆశా కార్యకర్తలు మంజుల, కాంతమ్మ, వెంకటమ్మ, వాలెంటీర్ చంద్ర, పంచాయితీ శానిటరీ సిబ్బంది పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో చౌడేశ్వరీదేవి జయంతోత్సవ వేడుకలు

**పామిడి, ఆగస్టు 12 ప్రభాతవార్త**



రాక్షస సంహారం కోసం దేవల మహర్షి ప్రార్థనతో అమవాస్య రోజున శ్రీ చౌడేశ్వరీదేవి ఉద్భవించిందని విఘ్నేశ్వర స్వామి దేవాలయ అర్చకులు పేర్కొన్నారు. మండల పరిదిలోని కాళాపురం గ్రామంలో వెలసిన విఘ్నేశ్వరస్వామి దేవాలయం నందు బుధవారం భక్తాదులు అత్యంత భక్తిశ్రద్ధలతో శ్రీ చౌడేశ్వరీదేవి జయంతోత్సవాన్ని నిర్వహించారు. విఘ్నేశ్వరస్వామికి భక్తులు అభిషేక పూజలు చేపట్టిన అనంతరం అర్చకులు శ్రీ చౌడేశ్వరీదేవి అమ్మవారిని శోభాయమానంగా అలంకరించి కళశస్థాపన, నివేదన, అభిషేక అర్చనలు, మహామంగళహారతి గావించరు. కొరిన కోరికలను తీర్చే కొంగు బంగారం శ్రీ చౌడేశ్వరీదేవి అని భక్తుల ప్రగాఢ విశ్వాసం. దేవాలయానికి పెద్దఎత్తున తరలివచ్చిన భక్తులు శ్రీ చౌడేశ్వరీదేవిని దర్శించుకుని పూజలు చేపడుతూ తీర్థప్రసాదాలను స్వీకరించి అమ్మవారి కృపకు పాత్రులయ్యారు. భక్తుల రద్దీతో దేవాయల ప్రాంగనం కిటకిటలాడగా అక్కడ పండుగ వాతావరణం నెలకొంది. తదనంతరం భక్తులకు అన్నదానం చేశారు. శక్తి స్వరూపిణి పార్వతీదేవి అవతారమే శ్రీ చౌడేశ్వరీదేవి అని అర్చకులు వెల్లడించారు.

## జ్ఞాన జ్యోతి శిక్షణా కార్యక్రమంను సందర్శించిన సమగ్ర శిక్షా ఎపిసి టి.శైలజ



జ్ఞాన జ్యోతి శిక్షణా కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎపిసి టి.శైలజా

**అనంతపురం న్యూటౌన్, ఆగస్టు 12 ప్రభాతవార్త**

గత రెండు రోజులుగా అంగన్వాడీ టీచర్లకు జరుగుతున్న జ్ఞాన జ్యోతి శిక్షణ కార్యక్రమంను సమగ్ర శిక్షా ఎపిసి టి.శైలజ బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఎపిసి శైలజ మాట్లాడుతూ.. పిల్లలకు విద్యా బుద్ధులు నేర్పించే పవిత్రమైన వృత్తిలో ఉండటం అంగన్వాడీ టీచర్ల అదృష్టం అనితెలియచేస్తూ పునాది దశలో విద్యను బోధించే మీ పాత్ర చాలా కీలకమైనది కావున బాధ్యతాయుతంగా పని చెయ్యాలని తెలియచేశారు. అదేవిధంగా మారుతున్న పరిస్థితులలో బోధన కూడా నవీన పద్ధతులలో ఎలా బోధించాలో తెలియ చేయడానికి ఈ శిక్షణా కార్యక్రమం ఏర్పాటు చేశామని కావున ఈ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని ఇక్కడ నేర్చుకున్న విషయాలు అన్నీ ఆకళింపు చేసుకొని మీ సెంటర్‌లలో పిల్లల అభివృద్ధికి తోడ్పడాలని తెలియచేశారు.

## సమగ్ర శిక్షలోపని చేస్తున్న ఉద్యోగస్తులకు వేతనాలు చెల్లించాలి: ఆపస్

**అనంతపురం న్యూటౌన్, ఆగస్టు 12 ప్రభాతవార్త**

అనంతపురం జిల్లా సమగ్ర శిక్షలో పనిచేస్తున్న ఔట్సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగస్తులకు వేతనాలు వెంటనే చెల్లించాలని ఆపస్ నేతలు కోరారు. బుధవారం వారు తెలియజేస్తూ.. వివిధ ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న ఆర్ట్, వర్క్ ఎడ్యుకేషన్ ఉపాధ్యాయులకు రెండు నెలలగా జీతాలు అందగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జీతం మీద మాత్రమే ఆధారపడి పని చేస్తూ కుటుంబ పోషణతో ఇబ్బంది పడుతున్న వారికి ప్రతి నెలవారీగా జీతాలు చెల్లించాలన్నారు. ఏజెన్సీ వాళ్ళు కావున వారికి నెలనెలా బిల్లులు పడేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. సిఆర్పిలకు, ఎమ్మార్సీ సిబ్బందికి నెలనెలా జీతాలు చెల్లించాలని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం(ఆపస్) అనంతపురం జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కళ్యాణి, ఎర్రిస్వామి ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

## అవయవ దానంతో... ఆయువు పోద్దాం..

**- కిమ్స్ సవీరా కన్సల్టెంట్ నెఫ్రాలజిస్ట్ ట్రాన్స్‌ప్లాంట్ ఫిజీషియన్ డా.వి.బదరినాథ్ రెడ్డి**

**అనంతపురం, ఆగస్టు 12 ప్రభాతవార్త బ్యూరో**



డా.వి.బదరినాథ్‌రెడ్డి

అవయవ దానంతో... ఆయువు పోద్దాం అని కిమ్స్ సవీరా కన్సల్టెంట్ నెఫ్రాలజిస్ట్ ట్రాన్స్‌ప్లాంట్ ఫిజీషియన్ డా.వి.బదరినాథ్ రెడ్డి పేర్కొన్నారు. ప్రతి సంవత్సరం ఆగస్టు 13న ప్రపంచ అవయవ దాన దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆయన మాట్లాడుతూ.. ప్రజల్లో అవగాహన పెంచడం. ఒక వ్యక్తి మరణించిన తర్వాత కూడా తన అవయవాలను దానం చేయడం ద్వారా అనేక మంది ప్రాణాలను కాపాడవచ్చు. అందుకే అవయవ దానాన్ని మహాదానంగా అభివర్ణిస్తారు. రాయలసీమ ప్రాంతంలో దీర్ఘకాలిక మూత్రపిండ వ్యాధులతో బాధపడుతున్న రోగుల సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. అనంతపురం జిల్లాలో కూడా డయాలిసిస్‌పై ఆధారపడే రోగులు పెరుగుతుండటం ఆందోళన కలిగించే విషయం. వీరిలో చాలామందికి మూత్రపిండ మార్పిడి మాత్రమే శాశ్వత పరిష్కారం. అయితే దాతల కొరత కారణంగా అనేక మంది సంవత్సరాల తరబడి ఎదురుచూడాల్సి వస్తోందన్నారు. మరణానంతరం గుండె, కాలేయం, మూత్రపిండాలు, ఊపిరితిత్తులు, కంటి కార్నియా వంటి అనేక అవయవాలను దానం చేయవచ్చు అని, ఒక బ్రెయిన్ డెడ్ దాత ఎనిమిది మందికి పైగా ప్రాణాలను కాపాడగలడు. అలాగే కంటి దానం ద్వారా ఇద్దరికి చూపును అందించవచ్చు. ఇది ఒక కుటుంబం సమాజానికి అందించే అమూల్యమైన సేవ అన్నారు. ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి అవయవ దాన ప్రతిజ్ఞ చేయాలని కోరుతున్నాం. జీవించి ఉన్నప్పుడు రక్తదానం ప్రాణాలను కాపాడితే, మరణానంతరం అవయవ దానం జీవితాలను కొనసాగిస్తుంది. మనం ఈ ప్రపంచాన్ని విడిచిపోయినా, మన అవయవాల ద్వారా మరొకరి హృదయం కొట్టుకోవచ్చు, మరొకరి కళ్లలో వెలుగు నింపవచ్చు, మరొకరి జీవితంలో ఆశ నాటవచ్చు. ఈ ప్రపంచ అవయవ దాన దినోత్సవం సందర్భంగా ప్రతి ఒక్కరూ అవయవ దానం గురించి ఆలోచించి, కుటుంబంతో చర్చించి, మహాదానానికి ముందడుగు వేయాలని పేర్కొన్నారు.

## గొప్ప పరిపాలనాదృక్షుడు చంద్రబాబునాయుడు

**- టిడిపి మైనార్టీ విభాగం కన్వీనర్ పఠాన్ ఖలంధర్**



సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తున్న దృశ్యం.

**పామిడి, ఆగస్టు 12 ప్రభాతవార్త**

ఎన్డీఏ పాలనలో ప్రజలంతా సుభిక్షంగా ఉన్నారని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గొప్ప పరిపాలనాదృక్షుడుగా ప్రఖ్యాతిగాంచి రాష్ట్రానికి ఆదర్శంగా నిలుస్తున్నారని టిడిపి మైనార్టీ విభాగం కన్వీనర్ పఠాన్ ఖలంధర్ కొనియాడారు. గ్రామపంచాయతీ పరిదిలోని 11వ వార్డులో బుధవారం పార్టీ శ్రేణులతో కలిసి ఇంటింటా టిడిపి కార్యక్రమాన్ని నిర్వహించిన టిడిపి మైనార్టీ విభాగం కన్వీనర్ పఠాన్ ఖలంధర్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు సాధిస్తున్న ప్రగతిని ప్రజలకు వివరించారు. రాష్ట్రాభివృద్ధి ప్రజాసంక్షేమమే చంద్రబాబునాయుడు లక్ష్యం అన్నారు. రాష్ట్రాన్ని అభివృద్ధిలో పరుగులు పెట్టిస్తూ అన్నివర్గాల ప్రజల అభ్యున్నతిని ఆకాంక్షిస్తూ సంక్షేమ పథకాలను అమలు చేస్తూనే పరిశ్రమలను తీసుకొస్తున్న ఘనత చంద్రబాబునాయుడుకే దక్కుతుందన్నారు. ఈకార్యక్రమంలో టిడిపి నాయకులు పాల్గొన్నారు.

## సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును పంపిణీ




సిఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేస్తున్న దృశ్యం

**గార్లదిన్నె, ఆగస్టు 12,ప్రభాత వార్త**

మండలంలోని గార్లదిన్నె గ్రామానికి చెందిన గుత్తి రెడ్డి నందివర్ధన్ రెడ్డికి రూ.1,25,068 విలువైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును ఉమ్మడి అనంతపురం జిల్లా ఏడీసీసీ బ్యాంక్ చైర్మన్ ముంటిమడుగు కేశవరెడ్డి పంపిణీ చేశారు.ఈ సందర్భంగా నందివర్ధన్ రెడ్డి కుటుంబ సభ్యులు కేశవరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## బాలబాలికల భద్రతకు పోలీసుల ప్రత్యేక గస్తీ

**గార్లదిన్నె, ఆగస్టు 12, ప్రభాత వార్త**



మర్తాడు హైస్కూల్ వద్ద బాలికలతో మాట్లాడుతున్న గార్లదిన్నె పోలీసులు

గార్లదిన్నె మండల పరిధిలోని మర్తాడు హైస్కూల్ వద్ద విద్యార్థుల భద్రతను దృష్టిలో ఉంచుకుని గార్లదిన్నె పోలీసులు ప్రత్యేక గస్తీ నిర్వహించారు. పాఠశాల ప్రారంభం, విద్యార్థుల రాకపోకలు, పాఠశాల ముగిసే సమయాల్లో పోలీసులు పాఠశాల పరిసరాల్లో పర్యటిస్తూ పరిస్థితిని పర్యవేక్షించారు. బాల, బాలికలకు ఎలాంటి ఇబ్బందులు ఎదురుకాకుండా ముందస్తు చర్యల్లో భాగంగా పాఠశాల పరిసరాల్లో నిఘా ఏర్పాటు చేశారు. పాఠశాల వద్ద అనుమానాస్పదంగా సంచరించే వ్యక్తులు, విద్యార్థులను ఇబ్బందులకు గురిచేసే అసాంఘిక కార్యకలాపాలపై పోలీసులు దృష్టి సారించారు. విద్యార్థులు భయాందోళనలకు గురికాకుండా సురక్షిత వాతావరణంలో విద్యాభ్యాసం కొనసాగించేలా రక్షణ కల్పించారు.అదేవిధంగా విద్యార్థులు రోడ్డు దాటే సమయంలో జాగ్రత్తలు పాటించాలని, అపరిచిత వ్యక్తులతో మాట్లాడకుండా అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచించారు. ఏదైనా సమస్య ఎదురైతే వెంటనే ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు లేదా పోలీసుల దృష్టికి తీసుకురావాలని తెలిపారు.బాలబాలికల భద్రతకు అధిక ప్రాధాన్యత ఇస్తూ పాఠశాలలు, విద్యాసంస్థల పరిసరాల్లో పోలీసుల గస్తీ, నిఘాను కొనసాగిస్తామని పోలీసులు పేర్కొన్నారు. పోలీసుల చర్యలపై విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.

## పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో స్క్రాప్ వేలం పాట

**అనంతపురం క్రైమ్ ఆగస్ట్ 12 ప్రభాతవార్త**

జిల్లా పోలీస్ కార్యాలయ ప్రాంగణంలోని ఆర్మ్‌డ్ రిజర్వ్ హెడ్‌క్వార్టర్స్ ఏఆర్ స్టోర్‌లో ఉన్న వివిధ రకాల కాలం చెల్లిన ఉపయోగించని వస్తువులకు ఈ నెల 17న బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు ఏ.ఆర్ అదనపు ఎస్పీ షేక్ ఇలియాస్ బాషా ఒక ప్రకటనలో తెలిపారు ముఖ్యంగా మెగాఫోన్లు, బ్యాటరీలు, కేన్ లాఠీలు, మస్కిటో నెట్లు సహా దాదాపు 30 రకాలకు చెందిన స్క్రాప్ వస్తువులను వేలంలో ఉంచనున్నారు. ఈ నెల 17న ఉదయం 11:00 గంటల నుండి మధ్యాహ్నం 1:00 గంట వరకు ఉంటుందన్నారు. ఆసక్తి ఉన్నవారు ఈ వేలంపాటలో పాల్గొనవచ్చని అధికారులు సూచించారు. ఇతర పూర్తి వివరాలు, నిబంధనల కోసం 9440796859, 9948364934 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని కోరారు.

## అర్హులైన ప్రతి ఒక్కరి ఓటు హక్కును కాపాడాలి

**- ధృవపత్రాలు లేవనే కారణంతో ఓటు తొలగించొద్దు.**

**- శింగనమల నియోజకవర్గ సమన్వయకర్త శైలజనాథ్..**



సర్ ఓట్ల వెరిఫికేషన్‌పై తహసీల్దార్‌తో చర్చిస్తున్న మాజీ మంత్రి సాకే శైలజనాథ్

**గార్లదిన్నె, ఆగస్టు 12, ప్రభాత వార్త**

శింగనమల నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ మంత్రి డాక్టర్ సాకే శైలజ నాథ్ బుధవారం గార్లదిన్నె మండల తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించారు. ప్రస్తుతం జరుగుతున్న సర్ ఓట్ల వెరిఫికేషన్ ప్రక్రియపై అధికారులతో చర్చించారు.ఈ సందర్భంగా శైలజనాథ్ మాట్లాడుతూ.. నోటీసుల పేరుతో అర్హత కలిగిన ఓటర్ల పేర్లను తొలగించడం సరికాదన్నారు. మరణించిన, అనర్హులైన ఓట్ల తొలగింపుపై ఎవరికీ అభ్యంతరం లేదని, అయితే అర్హత ఉన్నప్పటికీ సరైన ధృవపత్రాలు లేవనే కారణంతో ఓటు హక్కును తొలగించ కూడదని స్పష్టం చేశారు.కుల ధృవపత్రాలు, ఇళ్ల పట్టాలు వంటి అవసరమైన పత్రాలను ప్రభుత్వమే జారీ చేయాల్సి ఉంటుందని గుర్తుచేశారు. బిఎల్ఓల ద్వారా అర్హులైన ఓటర్ల ఇళ్లకు వెళ్లి, వారికి అవసరమైన ధృవపత్రాలు అందేలా చర్యలు తీసుకుని ప్రతి ఒక్కరి ఓటు హక్కును కాపాడాలని తహసీల్దార్‌ను కోరారు.ఈ కార్యక్రమంలో బండ్లపల్లి ప్రతాప్ రెడ్డి, అనంతపురం జిల్లా రైతు విభాగం అధ్యక్షుడు నారాయణ రెడ్డి, సీనియర్ నాయకుడు సుధాకర్ రెడ్డి, గార్లదిన్నె మండల అధ్యక్షుడు ఎల్లారెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి చీమల శ్రీనివాసులు, శింగనమల నియోజకవర్గ బూత్ కన్వీనర్ ఓబిరెడ్డి, గార్లదిన్నె మండలం బూత్ కన్వీనర్ సుంకిరెడ్డి తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## బ్యాంకు ఉద్యోగులకు ఐదు రోజుల పని దినాలు కల్పించాలని నిరసన

**వివిధ బ్యాంకు ఉద్యోగ సంఘాల సంఘటిత ఆందోళన**




అనంతపురం నగరంలోని సాయి నగర్ ఎస్బిఐ మెయిన్ బ్రాంచ్ ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న బ్యాంకు ఉద్యోగులు

**అనంతపురం, జులై 12, (ప్రభాతవార్త బ్యూరో)**

బ్యాంకు ఉద్యోగులకు కూడా వారంలో ఐదు రోజుల పనికిరాని కల్పించాలని, అన్ని శనివారాలు సెలవు దినాలుగా ప్రకటించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ బ్యాంకు ఉద్యోగులు బుధవారం పెద్ద ఎత్తున నిరసన వ్యక్తం చేశారు. అనంతపురం నగరంలోని సాయి నగర్ బ్రాంచ్ ఎదుట బుధవారం సాయంత్రం నిరసన కార్యక్రమం నిర్వహించి తమ డిమాండ్ల సాధన కోసం స్లోగన్స్ ఇచ్చారు. కేంద్ర ప్రభుత్వం ఆధీనంలోని వివిధ సంస్థల్లో ఐదు రోజుల పని దినాలు అమలు చేస్తున్నారని, బ్యాంకింగ్ సెక్టార్ లో కూడా అమలు చేయాలని వివిధ బ్యాంకు ఉద్యోగ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. బ్యాంకు ఉద్యోగులకు, అధికారులకు పని ఒత్తిడి ఎక్కువైందని, ఐదు రోజుల పని దినాలు కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందని నేతలు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో పలు బ్యాంకు ఉద్యోగ సంఘాల నాయకులు పాల్గొన్నారు. ఏ. ఐ .బి. ఇ .ఏ తరఫున శంకర్, ఎన్. సి. బి .ఇ తరఫున ఖాదర్, రఘురామ యాదవ్ యాదవ్, ఏ. ఐ.బి .ఓ. సి తరఫున నరేందర్ రెడ్డి,, తదితర వివిధ బ్యాంకు ఉద్యోగ సంఘాల నాయకులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

## వైద్య సిబ్బంది హాజరు 100 శాతం ఉండాల్సిందే

**- డిఎం అండ్ హెచ్ఓ కె.వెంకటేశ్వర్లు**



రికార్డులను పరిశీలిస్తున్న డిఎం అండ్ హెచ్ఓ కె.వెంకటేశ్వర్లు

**శింగనమల, ఆగస్టు 12 ప్రభాతవార్త**

మండల పరిధిలోని తరిమెలప్రాథమిక ఆరోగ్య కేంద్రంను బుధవారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి కె.వెంకటేశ్వర్లు ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన ఓపి వివరాలు, రోగులకు అందుతున్న వైద్య సేవలను గురించి విచారించారు. అనంతరం ఆయన వైద్య సిబ్బందితో మాట్లాడుతూ.. మండల పరిధిలోని అన్ని ఆరోగ్య కేంద్రాల్లో విరివిగా ప్రతి బుధవారం, శనివారం గర్భవతులకు, చిన్నారులకు వ్యాధి నిరోధక టీకాలు ఇవ్వాలని, ఇందులో ఎటువంటి నిర్లక్ష్యం చేయరాదన్నారు. ఐవిఆర్ఎస్ కాల్స్ ద్వారా ఆరోగ్య కేంద్రానికి వచ్చే రోగుల గురించి తీసుకునే పాజిటివ్ పర్సెప్షన్‌లో పురోగతి సాధించాలని సూచించారు. వైద్య సిబ్బంది 100 శాతం హాజరు ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా మలేరియా అధికారి డా.మనోజ్, తరిమెల పిహెచ్‌సి వైద్యాధికారి డా.శంకర్‌నాయక్, సిబ్బంది జయలలిత, నల్లప్ప తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా చౌడేశ్వరి అమ్మవారి జయంతి ఉత్సవాలు



చౌడేశ్వరి అమ్మవారిని దర్శించుకుంటున్న గ్రామస్తులు

**శింగనమల, ఆగస్టు 12 ప్రభాతవార్త**

మండల వ్యాప్తంగా బుధవారం చౌడేశ్వరి అమ్మవారి జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని ఆర్టిసి బస్టాండ్ వద్ద చౌడేశ్వరి దేవి అమ్మవారిని ప్రత్యేక అలంకరణ చేశారు. తరిమెల గ్రామంలో చౌడేశ్వరి దేవి జయంతి సందర్భంగా ఉత్సవ విగ్రహాన్ని గ్రామ పుర వీధుల గుండా డప్పు వాయిద్యాలతో ఘనంగా ఊరేగించారు. అమ్మవారి దర్శనం కోసం చుట్టు పక్కల గ్రామస్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. శింగనమలలోని చౌడేశ్వరి అమ్మవారిని దర్శించుకున్న భక్తులకు ఆలయ సిబ్బంది అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

**ZILLA PRAJA PARISHAD : ANANTHAPURAMU**
**SHORT TENDER NOTIFICATION NO: 767/G2/2021**

Short tenders are invited from the reputed Firms/Authorized Distributors for supply of the following items to the Zilla Praja Parishad, Ananthapuramu.

| S.No. | Name of the Comptent | Quantity |
|---|---|---|
| 1. | Desktop Computers | 18 |
| 2. | Xerox Machines | 02 |
| 3. | Scanners | 06 |
| 4. | Printers (B&W) | 06 |
| 5. | Printers (Colour) | 02 |
| 6. | UPS | 04 |

The Tender forms can be obtained from the Planning Section of Zilla Praja Parishad on 13.08.2026 to 17.08.2026 at 2.00 PM. EMD (refundable) of Rs.20,000/- to be remitted in the shape of DD drawn in favour of Chief Executive Office, Zilla Praja Parishad, Ananthapuramu should be enclosed to the tender.

Sd/- P.Vijaya Laxmi, C.E.O., Z.P.P.,ATP

04ATP12_04ATP12.qxd 12-08-2026 PM 11:09 Page 1



## మెగా డీఎస్సీపై వైఎస్.జగన్ చేస్తున్న ఆరోపణలు పూర్తి నిరాధారం

- ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ



పత్రికా సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ

**శింగనమల, ఆగస్టు 12 ప్రభాతవార్త**

మెగా డీఎస్సీ క్రీడా కోటా నియామకాలపై మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న ఆరోపణలు పూర్తిగా నిరాధారమైనవని, యువతను తప్పుదోవ పట్టించే రాజకీయ ప్రయత్నం అని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ తీవ్రంగా ఖండించారు. బుధవారం ఆమె జిల్లాకేంద్రంలోని ఎమ్మెల్యేక్యాంపు కార్యాలయంలో నిర్వహించిన పత్రికా సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. వైఎస్ఆర్‌సిపి ప్రభుత్వం అధికారంలో ఉన్న ఐదేళ్లలో ఒక్క డీఎస్సీ నోటిఫికేషన్ కూడా ఇవ్వకుండా వేలాది మంది బిఈడి, డిఈడి పూర్తి చేసిన నిరుద్యోగ యువతను తీవ్ర నిరాశకు గురి చేసిందని, ఎమ్మెల్యే గుర్తు చేశారు. ఉపాధ్యాయ ఉద్యోగం కోసం సంవత్సరాల తరబడి ఎదురు చూసిన అభ్యర్థుల జీవితాలతో చెలగాటం ఆడిన వారు నేడు పారదర్శకంగా జరిగిన మెగా డీఎస్సీ పై ఆరోపణలు చేయడం ప్రజలను నవ్వించే విషయమన్నారు. ఎన్నికల సందర్భంగా యిచ్చిన హామీని నిలబెట్టు కొంటూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడునాయకత్వంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే 16వేలకుపైగా ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేసే మెగా డీఎస్సీ ప్రక్రియను ప్రారంభించి పూర్తి చేసిందన్నారు. యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడంలో కూటమి ప్రభుత్వంచిత్తశుద్ధితో పని చేస్తోందన్నారు. రాజకీయ లబ్ది కోసం అసత్య ప్రచారాలు మానుకొని యువత ప్రయోజనాల కోసం నిర్మాణాత్మక సూచనలుచేయాలని ప్రతిపక్షాలకు ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ సూచించారు. ఈ కార్యక్రమంలో నాయీబ్రాహ్మణ కార్పోరేషన్ డైరెక్టర్ ఆదినారాయణ, శింగనమల మండల కన్వీనర్ మారుతినాయుడు, బికెఎస్ మండల కన్వీనర్ లక్ష్మీనారాయణ, పుట్లూరు మండల కన్వీనర్ శ్రీనివాసులు నాయుడు, సింగిల్ విండో అధ్యక్షులు గుర్రం లక్ష్మీనారాయణ, బండి పరుశురామ్, కాయల రమణయాదవ్, చెన్నయ్య, చామలూరు శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాలను ఆర్థికంగా బలోపేతం చేస్తూ మౌళిక వసతులను అభివృద్ధి చేయటమే లక్ష్యం

- జడ్పీ సీఈఓ విజయలక్ష్మి

- పంచ సమ్మేళన్ వికసిత్ భారత్ జీ రామ్ జీ చట్టం అవగాహన



వికసిత్ భారత్ జీ రామ్ జీ చట్టం అవగాహన జడ్పీ సీఈఓ విజయలక్ష్మి.

**పామిడి, ఆగస్టు 12 ప్రభాతవార్త**

వికసిత్ భారత్ జీ రామ్ జీ చట్టం ద్వార గ్రామీణ ప్రాంతాలను ఆర్థికంగా బలోపేతం చేస్తూ మౌళిక వసతులను అభివృద్ధి చేయటమే ప్రభుత్వాల లక్ష్యం అని జడ్పీ సీఈఓ విజయలక్ష్మి పేర్కొన్నారు. మండల ప్రజా పరిషత్ కార్యాలయం నందు బుధవారం ఎంపీడీఓ ప్రభాకర్ ఆధ్వర్యంలో పంచ సమ్మేళన్ వికసిత్ భారత్ జీ రామ్ జీ చట్టం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా జడ్పీ సీఈఓ విజయలక్ష్మి మాట్లాడుతూ ఉపాధి శ్రామికుల ఉపాధి కోసం, స్థిరమైన జీవనోపాధి అవకాశాలకు ప్రాధన్యతనిస్తూ సామాజిక ఆర్థిక సాధికారితను మరింత బలోపేతం చేయటమే ప్రధాన ఉద్దేశ్యంగా కేంద్ర ప్రభుత్వం ఈ చట్టాన్ని తీసుకొచ్చిందని తెలిపారు. వికసిత్ గ్రామపంచాయతీ ప్రణాళికలో అన్ని పథకాలు అనుసందానం చేస్తారని సాంకేతిక పరిజ్ఞానంతో శక్తివంతంగా ఈ చట్టాన్ని అమలు చేయటం జరుతుందన్నారు. మెరుగైన హామీ దృఢమైన నిబద్ధత, సమర్ధపాలన అంశాలే వికసిత్ భారత్ అని వివరించారు. ఎంపీడీఓ ప్రభాకర్ మాట్లాడుతూ ఎంజీఎన్ఆర్ఈజీఏ స్థానంలో ఈ ఏడాది జులై 1న వికసిత్ భారత్ జీ రామ్ జీ చట్టం అమల్లోకి వచ్చిందని పాత జాబ్ కార్డులన్నీ యథావిధిగా కొనసాగిస్తూ ప్రతి గ్రామీణ కుటుంబానికి ఏడాదికి 125 రోజుల వేతన ఉపాధి పనులను కల్పించటం జరుగుతుందంటూ గ్రామపంచాయతీ స్థాయిలో ఈ చట్టంపై రైతులు, కూలీలు, గ్రామీణులకు అవగాహన పొంపొందింటంలో పంచ సమ్మేళన్ ముఖ్యభూమికను పోషిస్తుందని వెల్లడించారు. ఈకార్యక్రమంలో ఏపీఓ ఆధినారాయణమ్మ పాల్గొన్నారు.

## శాస్త్రీయ విద్యా విధానం కోసం విద్యార్థులు పోరాడాలి



### మొదటిపేజీ తరువాయి...

ఏ ఐ ఎస్ ఎఫ్ అన్నారు. జిల్లాలో అనేక విద్యార్థి ఉద్యమాలకు ఆర్ట్స్ కాలేజీ ప్రధాన కేంద్రంగా వుందన్నారు. నగరం లోని, జిల్లాలోని విద్యార్థి , ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఏ ఎస్ ఎఫ్ సమరశీల పోరాటాలు చేసిందన్నారు. ఎస్ సి, ఎస్టీ , బీసీ పేద విద్యార్థుల స్కాలర్షిప్ ల కోసం, ఫీజుల రద్దుకోసం, ఈవ్ టీజింగ్ కు వ్యతిరేకంగా నగరంలో రౌడీయిజానికి, జిల్లాలో ఫ్యాక్షనిజానికి వ్యతిరేకంగా ఉద్యమాలు చేసిందన్నారు. నేడు దేశంలో విద్యారంగాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేస్తున్నారని, బడ్జెట్లో నిధులు తగ్గిస్తున్నారని, నిరుద్యోగాన్ని పెంచిపోషిస్తున్నారని ఆయన విమర్శించారు. 2019 నుండి కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న నీట్ పరీక్ష ప్రతి సంవత్సరం లీకు చేసి మెరిట్ విద్యార్థులకు అన్యాయం చేశారని, ఈ అవినీతి, అక్రమాలను ప్రశ్నిస్తున్న విద్యార్థులపై కర్కశంగా దాడి చేసి, వారిని దేశద్రోహులు గా చిత్రీకరిస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కావున జెన్ జీ డిల్లీ లో జరిగిన కాక్రోచ్ ఉద్యమాన్ని స్ఫూర్తిగా తీసుకొని హక్కుల కోసం పోరాడాలని, అవినీతి, అన్యాయాలను ప్రశ్నించాలని ఆయన పిలుపునిచ్చారు.. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి నారాయణస్వామి, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి లు రాజారెడ్డి, మల్లికార్జున, రచయిత దస్తగిరి, ఏ ఐ ఎస్ ఎఫ్ మాజీ జిల్లా నాయకులు వికే రంగారెడ్డి తిరుపతయ్య , ఖమర్ బేగం, కె చెన్నకేశవులు, బండి నాగరాజు, ఒంటెద్దు గోపాల్ రెడ్డి, అంకన్న, బి.రమణయ్య, నిరంజన్ గౌడ్, రామాంజనేయులు, జి నరేష్, ఎం.మధు, చిరంజీవి, నిర్వహణ కమిటీ సభ్యులు నగేష్, అజయ్ కుమార్, రామాంజనేయులు, ఆంజనేయులు, నరసింహ యాదవ్, ఉమా మహేష్ మంజునాథ్, వంశీ, సమీర్, నవీన్, నాని ,సాయి, బాబ్జాన్, సుస్రత్, ఆస్రాఫ్, లెనిన్, కల్లప్ప, రాజేష్ గౌడ్, ఆనంద్, గణేష్ వంశీ, దుర్గాప్రసాద్, ధనంజయ, ఏఐఎస్ఎఫ్ మాజీ నాయకులు, ఏఐఎస్ఎఫ్ నాయకులు, ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్షులు చంద్రనాయక్, రామదాస్, పుల్లయ్య, తిప్పేస్వామి, విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొనడం జరిగింది. వివిధ కళాశాలల విద్యార్థులు కూడా ఎక్కువ సంఖ్యలో పాల్గొన్నారు..

# అమెరికాకు వెళ్లినా వ్యవసాయంపై తగ్గని మక్కువ

- క్యాలిఫోర్నియాలో పంటలను పరిశీలించిన ఎమ్మెల్యే పరిటాల సునీత - అక్కడి సాగు విధానాలు, మార్కెటింగ్ వంటి వాటిని తెలుసుకున్న సునీత





వ్యసాయాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పరిటాల సునీత

**రాప్తాడు, ఆగస్టు 12 ప్రభాతవార్త**

నిత్యం ప్రజాక్షేత్రంలో ఉంటూ అభివృద్ధి, రాజకీయ కార్యక్రమాలతో బిజీ బిజీగా కనిపించే రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీతకు వ్యవసాయంపై తనకున్న మక్కువ ఏమాత్రం తగ్గలేదు. తరచూ తన వ్యవసాయక్షేత్రాన్ని సందర్శిస్తూ అక్కడే సమయం గడపటం, అలాగే రైతుల పొలాలను పరిశీలించడం వంటివి చేస్తుంటారు. అయితే తన వ్యక్తిగత పర్యటనలో భాగంగా అమెరికా వెళ్లిన ఆమె అక్కడ కూడా వ్యవసాయం పై ఆసక్తి చూపించారు. అక్కడ పంటలు ఎలా సాగుచేస్తున్నారో తెలుసుకోవాలన్న ఆసక్తితో క్యాలిఫోర్నియాలో పంట పొలాలను పరిశీలించారు. అక్కడి వ్యవసాయ విధానాలను, అలాగే పంటల ఉత్పత్తులు, మార్కెటింగ్ వంటి అంశాలను స్థానికంగా ఉన్న రైతులను అడిగి తెలుసుకున్నారు. భారత దేశంలో ఎమర్జెన్సీ ప్రకటించిన సమయంలో పంజాబ్ రాష్ట్రం నుంచి వలస వెళ్లిన సిక్కులు క్యాలిఫోర్నియాలో స్థిరపడగా.. ప్రస్తుతం ఓ సిక్కు రైతు 175 ఎకరాలలో ఆల్మండ్ (బాదం) పంట వేశారు. ఈ పంటను ఎమ్మెల్యే సునీత పరిశీలించారు. పంట ఎలా సాగు చేస్తున్నారన్న వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం ఈ పంట సాగు చేసి 8 సంవత్సరాలైందని.. ఒక ఎకరానికి 150 మొక్కలు నాటుతారని.. ఒక ఎకరానికి 1.6 టన్నుల దిగుబడి వస్తుందని వివరించారు. 100 ఎకరాల నుంచి 3వేల ఎకరాల దాకా ఒక్కో రైతు అక్కడ పంటలు సాగు చేస్తున్నట్లు తెలిపారు. పంటల నిర్వహణ విధానాన్ని తెలుసుకోవడంతో పాటు పంట కోత (హార్వెస్టింగ్) విధానాన్ని కూడా తెలుసుకున్నారు. మొత్తం యంత్రాల ద్వారానే హార్వెస్టింగ్ నిర్వహిస్తారని రైతులు వివరించారు. అమెరికాలో వ్యవసాయ విధానాలు చాలా సాంకేతికంగా ఉన్నాయని.. మార్కెటింగ్ లో కూడా మనం తెలుసుకోవాల్సినవి చాలా ఉన్నాయని ఎమ్మెల్యే సునీత తన అభిప్రాయాలను పంచుకున్నారు.

## మూడు పోలీస్ స్టేషన్ల ఆకస్మిక తనిఖీలు

**పోలీస్ స్టేషన్ల నిర్వహణ తీరుపై పరిశీలించిన ఎస్పీ**

**అనంతపురం క్రైమ్ ఆగస్ట్ 12 ప్రభాతవార్త**

జిల్లా పరిధిలోని పలు పోలీస్ స్టేషన్లను జిల్లా ఎస్పీ జగదీష్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రాప్తాడు, ఇటుకలపల్లి, బుక్కరాయసముద్రం పోలీసు స్టేషన్లను సందర్శించారు. అక్కడ నిర్వహించే విధులను, రికార్డులను, మౌలిక వసతులను ప్రత్యక్షంగా పరిశీలించారు. స్టేషన్‌లోని విజిటర్స్ రిజిస్టర్, డైరీ, పెండింగ్ కేసులు, ఎఫ్ఐఆర్ల నమోదు ప్రక్రియ, స్టేషన్ గదులను ఆయన నిశితంగా తనిఖీ చేశారు. స్టేషన్ ఆవరణల పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సిబ్బందికి సూచించారు. మహిళల భద్రతపై పోలీస్ యంత్రాంగం నిరంతరం అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. రాత్రి వేళల్లో మహిళల రక్షణ కోసం ప్రత్యేక గస్తీ ఏర్పాటు చేయాలని, వారి నుంచి వచ్చే ఫిర్యాదులపై తక్షణమే స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఆపరేషన్ నైట్ సేఫ్టీ, స్త్రీరక్ష పోర్టల్, శక్తి యాప్ సేవలపై విస్తృతంగా అవగాహన కల్పించాలి. జిల్లాలో రోడ్డు ప్రమాదాలను కట్టడి చేసేందుకు నిబంధనలు కఠినంగా అమలు చేయాలన్నారు. మద్యం తాగి వాహనాలు నడపడం, అతివేగం, హెల్మెట్ లేకపోవడం వంటి నిబంధనల ఉల్లంఘనలపై చర్యలు తీసుకోవడంతో పాటు, వాహనదారుల్లో అవగాహన పెంచే కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. మారుతున్న కాలానికి అనుగుణంగా పెరుగుతున్న సైబర్ నేరాల పట్ల ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. ఆన్‌లైన్ మోసాలు, సైబర్ క్రైమ్స్ బారిన పడకుండా గ్రామ స్థాయిలో అవగాహన సదస్సులు నిర్వహించాలని సిబ్బందిని ఆదేశించారు. స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో పోలీసు సిబ్బంది ఎంతో మర్యాదగా ప్రవర్తించాలని, అలసత్వం వహించకుండా తక్షణమే చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. పెండింగ్‌లో ఉన్న కేసులను వీలైనంత త్వరగా పరిష్కరించి బాధితులకు సమన్యాయం జరిగేలా చూడాలని అధికారులకు సూచించారు.



స్టేషన్ పనితీరును పరిశీలిస్తున్న ఎస్పీ

## ఆహార కల్తీకి అడ్డుకట్ట ఏదీ?

### మొదటిపేజీ తరువాయి...

కూడా పెరుగుతోంది. ఈ నేపథ్యంలో ఆహార పదార్థాల తయారీలో నాణ్యమైన ముడిసరుకును ఉపయోగిస్తున్నారా? నిబంధనలకు విరుద్ధమైన పదార్థాలు లేదా ఆరోగ్యానికి హానికరమైన రంగులు, రసాయనాలు వినియోగిస్తున్నారా? వంటగదుల్లో పరిశుభ్రత ప్రమాణాలు పాటిస్తున్నారా? ఆహారాన్ని సరైన ఉష్ణోగ్రతలో, సురక్షితమైన పద్ధతిలో నిల్వ చేస్తున్నారా? తయారీ, నిల్వ, విక్రయ ప్రాంతాల్లో పారిశుద్ధ్య ప్రమాణాలు ఎలా ఉన్నాయి? వంటి అంశాలపై నిరంతర తనిఖీలు అవసరం.

**జనవరి నుండి 37 ఫిర్యాదులు:**

జిల్లాలో ఆహార కల్తీలపై ఈ ఏడాది జనవరి నుండి ఆగస్టు 12 వరకు 37 ఫిర్యాదులు వచ్చాయి. 40 శాంపిల్స్ కూడా సేకరించినట్లు అధికారులు ద్వారా అందిన సమాచారం.

**అలవెన్స్ ఉన్నా.. వాహనం లేక ఇబ్బందులు:**

క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించే అధికారులకు ప్రయాణ అలవెన్స్ (ఒక నెలకు దాదాపు రూ.32 వేలు) ఉన్నప్పటికీ, తనిఖీల కోసం ప్రత్యేక వాహన సౌకర్యం లేకపోవడం మరో సమస్యగా మారింది. దీంతో మారుమూల ప్రాంతాల్లోని ఆహార విక్రయ కేంద్రాలు, చిన్నచిన్న ఫుడ్ పాయింట్లను క్రమం తప్పకుండా తనిఖీ చేయడం అధికారులకు ఇబ్బందిగా మారుతోంది. ఫిర్యాదు వచ్చినప్పుడు మాత్రమే స్పందించే పరిస్థితి కాకుండా ముందస్తు తనిఖీలు, ఆకస్మిక తనిఖీలు విస్తృతంగా నిర్వహించాల్సిన అవసరం ఉందని ప్రజలు కోరుతున్నారు. జిల్లాలో ఉన్న ఇద్దరు అధికారులకు ఒక్కొక్కరికి అలవెన్స్ నెలకు రూ.32 వేలు చొప్పున ఇద్దరికీ రూ.64 వేల రూపాయలను ప్రభుత్వం చెల్లిస్తుంది. అలవెన్స్ బదులు జిల్లాకు ఒక వాహన సౌకర్యం కల్పిస్తే అందుకు నెలకు కేవలం రూ. 35 వేలు మాత్రమే ఖర్చవుతుంది. ఆవాహనాన్ని ఇద్దరు అధికారులు వినియోగించుకోవచ్చు. ఇలా చేస్తే ప్రభుత్వానికి రూ.29 వేలు ఆర్థిక భారం తగ్గుతుంది. రాష్ట్రవ్యాప్తంగా అయితే లక్షలాది రూపాయల ఆర్థిక భారం తగ్గుతుంది.

**ప్రజారోగ్యంతో ముడిపడిన వ్యవహారం**

ఆహార భద్రత అనేది కేవలం వ్యాపార నియంత్రణకు సంబంధించిన అంశం కాదు. నేరుగా ప్రజారోగ్యంతో ముడిపడి ఉన్న వ్యవహారం. నాణ్యత లేని లేదా అపరిశుభ్రమైన ఆహారం వినియోగదారుల ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం చూపే అవకాశం ఉంటుంది. అందువల్ల ఆహార భద్రత అధికారులు నిరంతరం క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ నిబంధనలు పాటించని సంస్థలపై చర్యలు తీసుకోవడంతో పాటు, వ్యాపారులకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది.

**ఖాళీల భర్తీ.. వాహన సౌకర్యం కల్పించాలి**

జిల్లా ఆహార భద్రత లో ఖాళీగా ఉన్న 4 పోస్టులను వెంటనే భర్తీ చేయాలని, క్షేత్రస్థాయి తనిఖీల కోసం తగిన వాహన సౌకర్యం కల్పించాలని ప్రజలు కోరుతున్నారు. పెరుగుతున్న హోటళ్లు, రెస్టారెంట్లు, ఫాస్ట్‌ఫుడ్ కేంద్రాలకు అనుగుణంగా తనిఖీల సంఖ్యను పెంచి, ఆహార నాణ్యతపై కఠినమైన పర్యవేక్షణ ఉండాలని వారు అభిప్రాయపడుతున్నారు. ప్రజలకు సురక్షితమైన, నాణ్యమైన ఆహారం అందేలా వ్యవస్థను బలోపేతం చేయడమే కాకుండా.. నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటేనే ఆహార భద్రతపై ప్రజల్లో నమ్మకం పెరుగుతుంది. అయితే దీనిపై రాష్ట్ర ఉన్నతాధికారులు ఏ విధంగా స్పందిస్తాదన్నది వేచి చూడాల్సిందే.

## అమరావతిపై ఉన్న శ్రద్ధ రాయలసీమపై కూడా చూపించండి

- రాయలసీమకు తక్షణమే కృష్ణ జలాలు విడుదల చేయాలి - కరువు నుండి సీమ రైతాంగాన్ని ఆదుకోండి - మాజీ మంత్రి సాకే శైలజానాథ్



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్నమాజీ మంత్రి శైలజానాథ్

**అనంతపురం సిటీ, ఆగస్టు 12 ప్రభాతవార్త**

ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు అమరావతి కరకట్టమీద, అమరావతి మీద ఉన్న శ్రద్ధ రాయలసీమ రైతుల మీద లేదని అమరావతిపై పెట్టే శ్రద్ధ రాయలసీమ రైతాంగం పట్ల కూడా చూపించాలని మాజీ మంత్రి సాకే శైలజానాథ్ పేర్కొన్నారు. జిల్లా వైసిపి కార్యాలయంలో బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.. శ్రీశైలం డ్యాంలో ప్రస్తుతం 878 అడుగుల మేర 181 టీఎంసీల నీరు ఉన్నాయన్నారు. పోతిరెడ్డి పాడు ద్వారా 841 అడుగుల నుంచే 40 వేల క్యూ సెక్కుల నీటిని తీసుకునే అవకాశం ఉన్నప్పటికీ ఇప్పటి వరకు కేవలం 6వేల నుంచి 7వేల క్యూ సెక్కులు మాత్రమే వదులుతూ రాయలసీమకు తీరని అన్యాయం చేస్తున్నారని మండి పడ్డారు. రాయలసీమలో రిజర్వాయర్లు అడుగంటుతున్నా కళ్లు అప్పగించి చూస్తున్నారే తప్పా వాటిని నింపే ప్రయత్నం చేయడం లేదని మండి పడ్డారు. రాయలసీమ రైతుల కరువు కష్టాలను చూసి అయినా తక్షణమే కృష్ణ జలాలను రాయలసీమకు విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. రాయలసీమ ప్రాజెక్టులకు నీరు ఇవ్వడంలో కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని మండి పడ్డారు. రాయలసీమకు నేను పెద్ద బిడ్డను అను చెప్పుకనే చంద్రబాబునాయుడు వాస్తవానికి రాయలసీమ ప్రాంత చెడ్డ బిడ్డగా మిగిలిపోతున్నాడని ఆయన మండి పడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరిని వీడిపోతిరెడ్డి పాడు ద్వారా పూర్తి సామర్థ్యంతో నీటిని విడుదల చేసి రాయలసీమలోని రిజర్వాయర్లను నింపాలని ఆయన డిమాండ్ చేశారు. విలేకర్ల సమావేశంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి నార్పల సత్యనారాయణరెడ్డి, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ప్రతాప్‌రెడ్డి, రైతు విభాగం కార్యదర్శి వంశీగోకుళ్‌రెడ్డి, రాష్ట్ర బిసి సెల్ ప్రధాన కార్యదర్శి హరికృష్ణ, జిల్లా రైతు విభాగం ఉపాధ్యక్షులు మధుసూధన్‌రెడ్డి, జడ్పిటిసి నీలం భాస్కర్‌రెడ్డి, నాయకులు భాస్కర్‌రెడ్డి, దీపక్, శివశంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా అమృత విశ్వ విద్యాపీఠం స్నాతకోత్సవం



నారా లోకేష్‌ను సన్మానించి, జ్ఞాపికను అందజేస్తున్న దృశ్యం

**అనంతపురం కల్చరల్, ఆగస్టు 12 ప్రభాతవార్త**

అమరావతిలోని అమృత విశ్వ విద్యాపీఠం రెండవ స్నాతకోత్సవ వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి భారత మాజీ ఉపరాష్ట్రపతి ఎం. వెంకయ్యనాయుడు, రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యాపీఠంలో విద్య పూర్తి చేసుకున్న 319 మంది విద్యార్థులకు అతిథులు డిగ్రీ పట్టాలను అందజేశారు. వీరిలో 280 మంది బి.టెక్, 29 మంది ఎంబీఏ విద్యార్థులు ఉన్నారు. రాబోయే విద్యా సంవత్సరంలో అందుబాటులోకి తీసుకురానున్న నూతన కోర్సుల వివరాలను కూడా ఈ సందర్భంగా విద్యాపీఠం ప్రతినిధులు వెల్లడించారు.

## ఇంటింటికీ తెలుగుదేశం కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే జె.సి



సమస్యలను తెలుసుకుంటున్న ఎమ్మెల్యే జె.సి

**తాడిపత్రిఅర్బన్, ఆగస్టు 12 ప్రభాతవార్త**

తాడిపత్రి పట్టణంలోని పడమటిగేరిలో బుధవారం నిర్వహించిన ఇంటింటికీ తెలుగుదేశం కార్యక్రమంలో ఎమ్మెల్యే జె.సి అశ్మిత్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన వార్డులో పర్యటిస్తూ ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రజలు పలు సమస్యలను ఎమ్మెల్యే జె.సి అశ్మిత్‌రెడ్డి దృష్టికి తీసుకురాగా సంబంధిత అధికారులతో మాట్లాడి సత్వరమే ఆయా సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యే అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## ఎల్ నినో నేపథ్యంలో తాగునీటి విషయంలో జాగ్రత్తలు తీసుకోండి.

- 4 పంచాయతీల అధికారులకు ఎమ్మెల్యే దగ్గుపాటి ఆదేశం.
- క్యాంప్ కార్యాలయంలో ఎంపీడీఓ, డిప్యూటీ ఎంపీడీవో, పంచాయతీ అభివృద్ధి అధికారులు, ఎస్ఓలతో సమావేశం.



అధికారులతో సమావేశం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే

**అనంతపురం రూరల్, ఆగస్టు 12 ప్రభాతవార్త**

ఎల్‌నినో నేపథ్యంలో తాగునీటి సమస్య రాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలనిఅధికారులను ఎమ్మెల్యే దగ్గుపాటి ఆదేశించారు. తనక్యాంప్ కార్యాలయంలో బుధవారం ఎంపీడీఓ దివాకర్, డిప్యూటీ ఎంపీడీవో వెంకట నాయుడు, ఆర్డబ్ల్యూఎస్ ఏఈ హరికుమార్, ఏ నారాయణపురం స్పెషల్ ఆఫీసర్ సురేష్, నాలుగు పంచాయతీ అభివృద్ధి అధికారులు హీదయాతుల్లా, సర్దార్ వలి, రియాజ్ అహ్మద్, రాఘవేంద్రల తో ఆయన సమావేశం నిర్వహించారు. పంచాయతీల్లోజరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాల గురించి చర్చించారు. ప్రస్తుతం జరుగుతున్న పనుల్ని వేగవంతం చేయాలన్నారు. అలాగే కొత్త చేపట్టాల్సిన పనులపై ప్రతిపాదనలు సిద్ధంచేయాలని సూచించారు. పంచాయతీల్లో ఎక్కడా రోడ్లు, డ్రైనేజీల సమస్యలు ఉండకూడదన్నారు. ప్రజా దర్బార్ కార్యక్రమంలో ప్రజలు కొన్ని సమస్యలు తనదృష్టికితీసుకొచ్చారన్నారు. పారిశుద్ధ్య సమస్య మీద ప్రత్యేకంగా దృష్టి సారించాలన్నారు. వీధి లైట్ల సమస్యలు కూడా చెప్పారని ఇలాంటి చిన్న సమస్యలు మరోసారి రాకుండాచూసుకోవాలన్నారు. మరోవైపు ఎల్‌నినో నేపథ్యంలో తాగునీటిని అత్యంత జాగ్రత్తగా వినియోగించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజలు ఎక్కడా తాగునీటి సమస్యతో ఇబ్బంది పడకూడదని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ సూచించారు.

## ప్రజల భద్రతే మా లక్ష్యం

జిల్లా ఎస్పీ జగదీష్



ఆర్టీసీ బస్టాండ్‌లో కలియతిరుగుతున్న పోలీస్ అధికారులు

**అనంతపురం క్రైమ్ ఆగస్ట్ 12 ప్రభాతవార్త**

జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు మంగళవారం రాత్రి నుండి బుధవారం తెల్లవారుజామున వరకు పోలీసుల ప్రత్యేక నిఘా, ముమ్మర తనిఖీలు నిర్వహించారు. జిల్లాలోని ప్రధాన కూడళ్లు, సమస్యాత్మక ప్రాంతాలు, అంతరాష్ట్ర సరిహద్దుల వద్ద పటిష్ట బందోబస్తు జరిపారు. మద్యం సేవించి వాహనాలు నడిపిన పలువురిపై డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేసారు. అర్ధరాత్రి వేళల్లో రోడ్లపై అనవసరంగా సంచరిస్తున్న అనుమానితులను విచారించారు. సరైన కారణం లేకుండా సంచరిస్తున్న వారికి కౌన్సెలింగ్...పాత నేరస్తుల కదలికలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసారు. నివాస ప్రాంతాలు, వ్యాపార సముదాయాల్లో చోరీలు జరగకుండా బీట్ గస్తీని ముమ్మరం చేసారు. బ్యాంకులు, ఏటీఎం కేంద్రాల వద్ద భద్రతా పరిస్థితులను పర్యవేక్షించారు. రాత్రివేళల్లో నేరాలకు అడ్డుకట్ట వేసేందుకు గస్తీ కొనసాగించారు.

## మండల పరిషత్ మోడల్ ప్రైమరీ పాఠశాలను సందర్శించిన డిఈఓ

**అనంతపురం న్యూటౌన్, ఆగస్టు 12 ప్రభాతవార్త**

అనంతపురము జిల్లా విద్యాధికారి కార్యాలయం, సహాయ సంచాలకులు (పథకాలు) వి.శ్రీనివాసులు బుధవారం అనంతపురము రూరల్, ఎన్.ఆర్.ఎస్.రెడ్డి కాలనీ లోని మండల పరిషత్ మోడల్ ప్రైమరీ పాఠశాలను సందర్శించారు. పాఠశాల యుడిఎస్ఈ కోడ్ 28222501414. విద్యార్థుల సంఖ్య 141. 12082026 నాటి హాజరు 98. పిల్లల హాజరును మెరుగుపరచాలని ప్రధానోపాధ్యాయునికి సూచనలు జారీ చేశారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి, ఆహారాన్ని రుచి చూశారు. మధ్యాహ్న భోజనంపై ఉపాధ్యాయుల అభిప్రాయాన్ని ధృవీకరించారు. ఈ పాఠశాలలో కె.విజయ భాస్కర్, ఎస్.జి.టి (వి.హెచ్) (దృష్టి లోపం ఉన్నవారు) పనిచేస్తున్నట్లు గమనించారు. ఆయన పాఠశాలకు రూ.3.50 లక్షల విలువైన సరస్వతి విగ్రహాన్ని విరాళంగా ఇచ్చి, దానిని పాఠశాలలో ప్రతిష్ఠించారు. ఈ ఉపాధ్యాయుడు ఇద్దరు పేద పిల్లలను దత్తత తీసుకుని, వారికి విద్యను అందించి, వివాహం చేశారని తెలిసింది, ఆయన సేవా స్ఫూర్తి ఎంతగానో ప్రశంసించారు.



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న డిఈఓ

## క్రీడలతోనే ఉన్నత భవిష్యత్తు

- డిఎస్‌డిఓ మంజుళ



క్రీడా కారులతో డిఎస్‌డిఓ మంజుళ

**అనంతపురం సిటీ, ఆగస్టు 12 ప్రభాతవార్త**

క్రీడలతోనే విద్యార్థులకు ఉన్నత భవిష్యత్తు ఉంటుందని డిఎస్‌డిఓ మంజుళ పేర్కొన్నారు. జిల్లా స్థాయి అమరావతి ఛాంపియన్ షిప్ పోటీలలో భాగంగా రెండో రోజు పలు క్రీడా పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా కబడ్డీ క్రీడాకారులను డిఎస్‌డిఓ మంజుళ పరిచయం చేసుకుని పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. క్రీడా కారులు విద్యతోపాటు క్రీడలలోనూ ప్రావీణ్యం కలిగి ఉండాలని సూచించారు. క్రీడల్లో రాణిస్తే క్రీడా కోటాలో ప్రభుత్వ ఉద్యోగాలు కూడా పొందేందుకు అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా అండర్-17, 23 విభాగాలలో పలు క్రీడా పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో ప్రతిభ కనబర్చిన క్రీడా జట్లు రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొననున్నారు. కార్యక్రమంలో పలువురు కోచ్‌లు, పిఈటిలు పాల్గొన్నారు.



వాలీబాల్ పోటీలో తలపడుతున్న క్రీడాకారులు